# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

31.03.2026 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 249 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

Say NO to hate speech

**సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్!**

- విద్వేష ప్రసంగాలకు ఇక చెక్.. 10 ఏళ్ల వరకు జైలు శిక్ష
- ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అన్న బీజేపీ



తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమో దించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసం గాలకు చెక్ పడనుంది.

## న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

02

## గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ



# 30 వేల లంచం డిమాండ్

- ఏసీబీ చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై
- ఇసుక వాహనాల విడుదల కోసం..
- 20 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత!

రూ. 30 వేల లంచం డిమాండ్ చేసి 20 వేలు తీసుకుంటూ నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల ఎస్సై హరిప్రసాద్ రెడ్డి సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు.

2






## క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

- జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్

2

# రెండు విడతల్లో జనగణన

- ఏపీ, తెలంగాణ షెడ్యూల్ విడుదల
- మే 1 నుంచి ఏపీలో.. మే 11 నుంచి తెలంగాణలో ఇళ్ల సర్వే
- తొలిసారిగా 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'కు అవకాశం..
- 16 భాషల్లో మొబైల్ యాప్ ద్వారా సేకరణ
- సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ




**ఢిల్లీ, మార్చి 30:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు విడతల్లో ఈ జనగణన జరుగుతుందని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. ఈసారి మొత్తం రూ. 11,718 కోట్ల భారీ వ్యయంతో, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ 16 భాషల్లో మొ-బైల్ యాప్ ద్వారా వివరాలను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు.

మిగతా 2 లో




# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బీజేపీ లక్ష్మణ్ రాజీనామా చేయాలి
- కేసీఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

"ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు."

**హైదరాబాద్, మార్చి 30:** రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ. 14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు.

మిగతా 2 లో



## ఆ క్రెడిట్ సీఎందే

- అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్

2



## కోటి ఎకరాల ఆక్రమణకు టెండర్

- సీఎం, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కేటీఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ

03

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- సీఎంకు కవిత లేఖ

3



# కువైట్ ప్లాంట్‌పై ఇరాన్ దాడి

- భారతీయ కార్మికుడు మృతి!
- విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారమే లక్ష్యంగా విరుచుకుపడ్డ డ్రోన్లు
- పశ్చిమాసియా యుద్ధ జ్వాలల్లో నలుగుతున్న గల్ఫ్ దేశాలు
- భారతీయుల భద్రతపై ఆందోళన

4



## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

4





# రెండు విడతల్లో జనగణన

## ఏపీ, తెలంగాణ షెడ్యూల్ విడుదల

**మే 1 నుంచి ఏపీలో.. మే 11 నుంచి తెలంగాణలో ఇళ్ల సర్వే**

**సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ**

**ఢిల్లీ, మార్చి 30:** దేశవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జనగణన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు విడతల్లో ఈ జనగణన జరుగుతుందని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. ఈసారి మొత్తం రూ. 11,718 కోట్ల భారీ వ్యయంతో, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ 16 భాషల్లో మొబైల్ యాప్ ద్వారా వివరాలను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇళ్ల సర్వే జరుగుతుందని, దీనికి ముందుగా ఏప్రిల్ 16 నుంచి 30 వరకు ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'కు అవకాశం కల్పించినట్లు వివరించారు. అలాగే తెలంగాణలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ఇళ్ల సర్వే నిర్వహిస్తారని, ఇక్కడ ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వయంగా వివరాలు నమోదు చేసుకోవచ్చని షెడ్యూల్ ఖరారు చేశారు. తొలి విడతలో భాగంగా గృహాల లెక్కింపు చేపడతారని, ఇందులో ఇంటి పరిస్థితి, వసతులు, ఆస్తులు మరియు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు సంబంధించిన వివరాలతో కూడిన మొత్తం 34 ప్రశ్నలకు ప్రజలు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెండో దశలో కులగణనతో పాటు వలసలు, సంతానోత్పత్తి వంటి సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సమాచారాన్ని సేకరిస్తామని రిజిస్ట్రార్ జనరల్ వివరించారు. ప్రజలు అందించే సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. ఎన్యుమరేటర్లు తమ సొంత మొబైల్స్ ద్వారానే డేటాను సేకరిస్తారని, ప్రజలు నేరుగా https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా కూడా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఈ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి కానుంది.

# న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

**అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్, మార్చి 30:** న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకొస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభలో వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పట్టపగలే వారిని హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ప్రోద్భలంతోనే వారు హత్యకు గురైనట్లు ఆక్షేపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ బిల్లు తీసుకొస్తున్నట్లు చెప్పారు.

# సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

**అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్**



**హైదరాబాద్, మార్చి 30:** సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్..సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చుచేశామని చెప్పారు. ఇపుడు పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు. ఎంత ఖర్చైనా సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల ఖాతాలో ఇప్పటి వరకు రూ. 40 వేల కోట్లు వేశామన్నారు ఉత్తమ్. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకువేస్తున్నామని తెలిపారు. అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

**జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్**

**హైదరాబాద్, మార్చి 30:** క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఆయన లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంలోని సౌకర్యాలను ఎంపీ రఘునందన్ రావు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రిలో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఇందులో ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే.. తగిన చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు.

# 30 వేల లంచం డిమాండ్

**ఏసీబీ చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై**

**నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల ఎస్సై హరిప్రసాద్ రెడ్డి సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. వాహనాల విడుదల కోసం బాధితుడి నుంచి రూ.30 వేల లంచం డిమాండ్ చేస్తూ, రూ. 20 వేలు తీసుకుంటుండగా మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 5న ఇసుక సరఫరా చేస్తున్న ఒక వ్యక్తికి చెందిన ట్రాక్టర్, జేసీబీని ఎస్సై హరిప్రసాద్ రెడ్డి పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి వివరాలను జిల్లా మైనింగ్ అధికారులకు పంపగా, వారు ఆ వాహనాలకు 60 వేల జరిమానా విధించారు. బాధితుడు ఈ నెల 7నే జరిమానా మొత్తాన్ని చెల్లించి, వాహనాలను విడుదల చేయాలని కోరుతూ మైనింగ్ అధికారుల పత్రాలను ఎస్సైకి అందజేశాడు. అయితే, మైనింగ్ ఫైన్ చెల్లించినా సంబంధం లేదని, తనకు విడిగా రూ. 30 వేలు లంచం ఇస్తేనే వాహనాలను వదిలిపెడతానని ఎస్సై భీష్మించుక కూర్చున్నాడు. ఎస్సై వేధింపులు భరించలేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఎస్సై లంచం డిమాండ్ చేస్తున్న వాయిస్ రికార్డింగ్‌లతో సహా అన్ని ఆధారాలను అధికారులకు సమర్పించాడు. ఈ క్రమంలో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రూ. 20 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ బృందం మెరుపు దాడి చేసి పట్టుకుంది. ఎస్సై హరిప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు. అవినీతికి పాల్పడే అధికారులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్
- బిల్లును వ్యతిరేకించిన బిజెపి

**హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించడం, ఈ నేరాలను నాన్-బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.



# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు.

# పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, మార్చి 30:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పొంగులేటిని బర్తరఫ్ చేయండి

**గవర్నర్‌కు బిఆర్ఎస్ విజ్ఞప్తి**

**హైదరాబాద్:** ప్రతిపక్షాన్ని సీఎం బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

మొదటి పేజీ తరువాయి

వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు.



యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

# కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

- సీఎం, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కేటీఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ



**హైదరాబాద్, మార్చి 30:** సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- గతంలో పీసీసీ చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

**హైదరాబాద్, మార్చి 30:** జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.



# నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

**సింగరేణికి సమంబంధించి పలు సూచనలు చేసిన కాగ్**

**హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.





# అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

**హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే**

**ప్రతిపక్ష నేత మధుసూదనాచారి**

**హైదరాబాద్, మార్చి 30:** రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.





# చిత్తశుద్ధి ఉంటే ఓవైసీపై చర్య తీసుకోండి!

**తెలంగాణ ప్రభుత్వానికి బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సవాల్**

**రాజ్యసభలో ఓబీసీ అంశంపై విపక్షాల అడ్డంకులు**

**న్యూఢిల్లీ, మార్చి 30:** హేట్ స్పీచ్ బిల్లుపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. మొదట అక్బరుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వానికి అటువంటి చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని తాను ప్రస్తావిస్తే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు అడ్డుకున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు.

**ఓబీసీల గొంతు నొక్కుతున్నారు**

సోమవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, అన్ని విపక్ష పార్టీలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశాయని లక్ష్మణ్ ఆరోపించారు. ఓబీసీ జాబితాలో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. దీనివల్ల అసలైన ఓబీసీలు వెనకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే సైతం తనను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారని తెలిపారు.

**ఓట్ల కోసం రిజర్వేషన్లు**

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను ఒక కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చి 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని లక్ష్మణ్ చెప్పారు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నారని విమర్శించారు. కేవలం ఒక వర్గం ఓట్ల కోసమే పార్టీలు ఇలా కక్కుర్తి పడుతున్నాయని మండిపడ్డారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు ఉన్న స్థానాల్లో కూడా ముస్లింలే పోటీ చేశారని ఎంపీ లక్ష్మణ్ గుర్తు చేశారు.

# కృష్ణా నదిలో దూకి కౌలు రైతు ఆత్మహత్య

**రెండేళ్లుగా సాగులో నష్టాలు.. హైదరాబాద్‌కు వలస**

**పిల్లలను చూసి వెళ్తూ ప్రాణాలు తీసుకున్న నాగరాజు**

**నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో విషాదం**

**నారాయణపేట, మార్చి 30:** నారాయణపేట జిల్లాలో తీరని విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. కన్న భూతల్లిని నమ్ముకుని సాగు చేసిన ఆ రైతుకు గత 2 ఏళ్లుగా ప్రకృతి కన్నెర్ర చేయడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. చివరికి కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణ మండలంలోని గుడేబల్లూరులో సోమవారం వెలుగుచూసింది. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో పెను విషాదం నెలకొంది. గుడేబల్లూరు టై రోడ్డు చెక్‌పోస్టు వద్ద నివసించే నాగరాజు (55) కృష్ణా పరివాహక ప్రాంతంలో భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత 2 ఏళ్లుగా ఆయన పండించిన వరి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి ఇవ్వలేదు. వాతావరణ మార్పులు, తెగుళ్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన నాగరాజుకు అప్పులు కొండలా పెరిగిపోయాయి. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఈ విడత సాగుకు దూరంగా ఉన్నాడు.

**వలస వెళ్లినా తీరని వేదన..**

సాగు కోసం చేసిన అప్పులు తీర్చేందుకు, తన కుటుంబాన్ని పోషించుకోవడానికి వేరే దారి లేక నాగరాజు హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ చిన్న చిన్న పనులు చేస్తూ కూలీగా మారాడు. 2 రోజుల క్రితమే తన భార్యాపిల్లలను చూసేందుకు సొంత గ్రామానికి వచ్చాడు. తన కుటుంబాన్ని చూసి సంతోషంగా వెనక్కి వెళ్తాడనుకున్న నాగరాజు.. మనసులో ఉన్న అప్పుల బాధను దిగమింగుకోలేకపోయాడు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కృష్ణ బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో నుంచి నాగరాజు మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పుల బాధ భరించలేకనే తన భర్త ప్రాణాలు తీసుకున్నాడని మృతుడి భార్య పోలీసుల వద్ద విలపించిన తీరు అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. ఈ ఘటనతో గుడేబల్లూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తీరని శోకంలో ఉన్న ఆ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని స్థానికులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# నగరంలో డ్రగ్స్ కలకలం


**మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్**



**హైదరాబాద్,మార్చి30 :** హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఆటో బోల్తా: తల్లీ కుమారుడు మృతి

**కామారెడ్డి,మార్చి30 :** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల శివారులో ఘోర ప్రమాదం జరిగింది. ఆటో బోల్తాపడిన ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వేడుకకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.



సంపాదకీయం

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య!

ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీ-యులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయిం పులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్దరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెటెక్కుతారు. నదీ జలాలలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుఉతంది.



# ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్, మార్చి 30: ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉ న్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.




# కువైట్ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

- భారతీయ కార్మికుడు మృతి!
- విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారమే లక్ష్యంగా విరుచుకుపడ్డ డ్రోన్లు
- పశ్చిమాసియా యుద్ధ జ్వాలల్లో నలుగుతున్న గల్ఫ్ దేశాలు
- భారతీయుల భద్రతపై పెరుగుతున్న ఆందోళన



**ఢిల్లీ:** పశ్చిమాసియాలో ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు పెను శాపంగా మారుతున్నాయి. కువైట్‌లోని ఒక కీలక విద్యుత్ మరియు నీటి శుద్ధీకరణ ప్లాంట్‌పై ఇరాన్ నిర్వహించిన డ్రోన్ దాడుల్లో ఒక భారతీయ కార్మికుడు (టెక్నీషియన్) మరణించడం తీవ్ర విషాదాన్ని నింపింది. కువైట్ విద్యుత్, నీరు, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు చెందిన ప్రధాన ప్లాంట్‌లోని సర్వీస్ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. డ్రోన్ నేరుగా భవనాన్ని ఢీకొనడంతో కంట్రోల్ రూమ్ తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ ఘటనలో విధి నిర్వహణలో ఉన్న భారతీయ పౌరుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొంతమంది సిబ్బంది గాయపడినట్లు సమాచారం. ఈ దాడి కారణంగా కువైట్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా తన యుద్ధనౌకలు, సైనిక బలగాలను గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి తమపై దాడులకు ఉపయోగిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే అమెరికాకు సహకరిస్తున్న దేశాల ఆర్థిక మూలాలను, ముఖ్యంగా విద్యుత్ మరియు నీటి ప్లాంట్లపై దాడులు చేస్తామని ఇరాన్ చేసిన హెచ్చరికలు ఇప్పుడు వాస్తవ రూపం దాల్చుతున్నాయి.


## భారతీయ కార్మికుల భద్రతపై నీలి నీడలు

పశ్చిమాసియాలో సాగుతున్న ఈ భీకర యుద్ధంలో ఇప్పటివరకు సుమారు 8 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత గురువారం యూఏఈలో జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయుడు మరణించగా, ఇప్పుడు కువైట్‌లో మరో ప్రాణం పోవడం గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య కాకుండా కువైట్, యూఏఈ, బహ్రెయిన్ వంటి దేశాలకు విస్తరిస్తుండటం అంతర్జాతీయ సమాజాన్ని కలవరపెడుతోంది.

# ఢిల్లీ పోలీసులకు చిక్కిన లష్కరే ఉగ్రవాది

- బంగ్లాదేశ్ కేంద్రంగా భారత్‌పై కుట్ర!
- 26/11 మాస్టర్ మైండ్ హఫీజ్ సయీద్‌తో షబ్బీర్ అహ్మద్ లోన్‌కు సంబంధాలు
- తీహార్ జైలు నుంచి విడుదలయ్యాక బంగ్లాలో నెట్‌వర్క్ పునర్నిర్మాణం

**ఢిల్లీ, మార్చి 30:** భారతదేశంపై దాడులకు వ్యూహరచన చేస్తున్న లష్కరే తోయిబా కీలక ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ లోన్‌ను ఢిల్లీ పోలీసులు వ్యూహాత్మకంగా అరెస్ట్ చేశారు. శ్రీనగర్‌కు చెందిన షబ్బీర్, పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆదేశాల మేరకు లష్కరే తరపున దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అధికారులు ధృవీకరించారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో తలదాచుకున్న ఇతడిని నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. షబ్బీర్ అహ్మద్ లోన్ బంగ్లాదేశ్‌లో ఉంటూ భారత్‌పై దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ముఖ్యంగా భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ జాతీయులను ఉగ్రవాద కార్యకలాపాల్లోకి నెట్టడం ఇతడి ప్రధాన ఎత్తుగడ. ఇలా చేయడం ద్వారా దాడుల వెనుక పాకిస్థాన్ పేరు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. 2007లోనే భారీ ఆయుధాలతో పట్టుబడిన షబ్బీర్, 2018 వరకు తీహార్ జైల్లో శిక్ష అనుభవించాడు. 2018లో బెయిల్ పొందిన తర్వాత భారత్ నుంచి తప్పించుకుని బంగ్లాదేశ్ వెళ్ళిపోయాడు. అక్కడ మళ్లీ లష్కరే నెట్‌వర్క్‌ను పునర్నిర్మించి, విధ్వంసకర దాడులకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా పెంచారు. ముంబై దాడుల



సూత్రధారి హఫీజ్ సయీద్‌తో కూడా ఇతనికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. షబ్బీర్ అరె-స్టుతో దేశంలో జరగబోయే పెద్ద ప్రమాదం తప్పిందని భద్రతా దళాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం నిందితుడిని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

## స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు

**హైదరాబాద్, మార్చి 30 :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ఢమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ఏఐ వీడియోలతో జాగ్రత్త

- అస్సాం బీజేపీ కార్యకర్తలకు ప్రధాని మోదీ హెచ్చరిక!
- 'మేరా బూత్ సబ్‌సే మజబూత్' కార్యక్రమంలో నమో యాప్ ద్వారా దిశానిర్దేశం
- - ఏప్రిల్ 9న అస్సాం అసెంబ్లీ ఎన్నికలు.. మే 4న ఫలితాలు

**ఢిల్లీ, మార్చి 30:** అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం 'నమో యాప్' ద్వారా నిర్వహించిన 'మేరా బూత్ సబ్‌సే మజబూత్ సంవాద్' కార్యక్రమంలో పాల్గొన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అస్సాం బీజేపీ కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో బీజేపీ-ఎన్డీయే కూటమి మూడోసారి ఘనవిజయం సాధించేందుకు కార్యకర్తలు చేస్తున్న కృషిని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఎన్నికల సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించే నకిలీ వీడియోల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రధాని కార్యకర్తలను హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు సమాచారం ప్రజాస్వామ్య ప్రక్రియకు ముప్పు కలిగిస్తుందని, ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అస్సాంలో అస్థిరత, అశాంతి ఉండేవని.. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువత ఆ పరిస్థితులను గమనించాలని



కోరారు. శాంతి, సుస్థిరత ఉంటేనే నిలకడైన అభివృద్ధి సాధ్యమని ప్రధాని స్పష్టం చేశారు.

## అస్సాం ఎన్నికల ముఖచిత్రం - 2026

నియోజకవర్గాల పునర్విభజన అనంతరం అస్సాంలో జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవే కావడం విశేషం. మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో బీజేపీకి 64 మంది సభ్యుల బలం ఉండగా, మిత్రపక్షాలైన ఏజీపీ (9), యూపీపీఎల్ (7), బీపీఎఫ్ (3) లతో కలిసి కూటమి పటిష్టంగా ఉంది. విపక్షంలో కాంగ్రెస్‌కు 26 మంది, ఏఐయూడీఎఫ్‌కు 15 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ప్రధాని పిలుపునిచ్చారు.




# జై శ్రీరామ్

రామ నామ స్మరణతో మార్మోగిన పట్టణం

## మెట్‌పల్లిలో వీర హనుమాన్ విజయ యాత్ర

వెయ్యికి పైగా దీక్ష స్వాముల ర్యాలీ





**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** భక్తి, ఐక్యత, ధర్మ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన వీర హనుమాన్ విజయ యాత్ర ఆద్యంతం ఘనంగా జరిగింది. 'జై శ్రీరామ్... జై హనుమాన్' నినాదాలతో పట్టణం మార్మోగిపోగా, కాషాయ జెండాలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర భక్తి వాతావరణాన్ని నెలకొల్పింది.

### భక్తి జోష్‌తో సాగిన శోభాయాత్ర

పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన వెయ్యికి పైగా హనుమాన్ దీక్ష స్వాములు ఈ యాత్రలో పాల్గొన్నారు. భజనలు, నినాదాలతో పురవీధులు మార్మోగించగా, యాత్ర భక్తి ప్రవాహంలా ముందుకు సాగింది. పార్టీలకు అతీతంగా వందలాది హిందూ బంధువులు పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద ప్రారంభం

పట్టణంలోని మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు పాల్గొని యాత్రను ప్రారంభించి భక్తులతో కలిసి ర్యాలీలో నడిచారు. యాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ వై. అనూప్ రావు, ఓబీసీ మోర్చా నాయకుడు రుద్ర శ్రీనివాస్, 11వ వార్డు కౌన్సిలర్ మరియు బీజేపీ టౌన్ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ, బత్తిని అనుదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ వర్గాలకు చెందిన నాయకులు హాజరవడం కార్యక్రమానికి ప్రాధాన్యతను చాటింది. ఈ విజయ యాత్ర ద్వారా సమాజంలో ఐక్యత, ధార్మిక చైతన్యం పెంపొందించాలని నిర్వాహకులు తెలిపారు. భక్తి ఉంటే భయం ఉండదనే సందేశంతో యాత్ర ముగిసింది. పాల్గొన్న భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమవంతు సహకారం అందించారు.





# పేనుకు పెత్తనం ఇస్తే..



జగిత్యాల ఎస్టీ హాస్టల్లో అమానుష ఘటన.. • పడుకున్న చిన్నారులపై దారుణంగా దాడి

## చీపురుతో విద్యార్థులను చితకబాదిన సిబ్బంది శ్రీనివాస్

'మద్యం మత్తు'లో విధులు... నాలుగు నెలలుగా వేధింపుల ఆరోపణలు

ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా నిర్వాహకుల నిర్లక్ష్యం... ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో(రాధారపు నర్సయ్య):** "చిన్నారుల భద్రతకు కంచుకోటగా ఉండాల్సిన హాస్టల్‌నే హింసకు అడ్డాగా మార్చిన దారుణ ఘటన జగిత్యాలలో వెలుగుచూసింది. బాధ్యతలేని సిబ్బంది క్రూరత్వానికి బలై చిన్నారులు భయంతో వణికిపోతుండగా, నిర్వాహకుల నిర్లక్ష్యం ఈ అమానుషానికి మరింత బలం చేకూర్చిన వైనం తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తోంది."

### పడుకున్న చిన్నారులపై క్రూర దాడి

జగిత్యాల జిల్లాలోని ఎస్టీ హాస్టల్‌లో కూరగాయలు కోసే పనిలో ఉన్న శ్రీనివాస్ అనే వ్యక్తి విద్యార్థులను చీపురుతో చితకబాదిన ఘటన సంచలనం రేపుతోంది. చిన్నారులని కూడా చూడకుండా కనికరం లేకుండా.. కొట్టిన ఈ ఘటన హాస్టల్‌లో భయానక పరిస్థితులను సృష్టించింది. 'పేనుకు పెత్తనం ఇస్తే నెత్తిమొత్తం కొరికిందట' అన్న సామెతను గుర్తు చేసేలా ఈ ఘటన ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మద్యం మత్తులో విధులు

శ్రీనివాస్ నిత్యం మద్యం మత్తులోనే విధులకు హాజరవుతున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగు నెలలుగా విద్యార్థులను వేధిస్తూ వస్తున్నాడని సమాచారం. అతని ప్రవర్తనతో చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

### నిర్వాహకుల నిర్లక్ష్యం

ఈ ఘటనపై విద్యార్థులు పలుమార్లు హాస్టల్ నిర్వాహకులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకుల నిర్లక్ష్యమే ఇలాంటి ఘటనలకు కారణమని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల భద్రతపై రాజీ పడకుండా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

# కొత్త ఆర్థిక సంవత్సరం.. కొత్త రూల్స్!

**ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కీలక ఆర్థిక మార్పులు**

## పన్నుల విధానం నుంచి ఈపీఎఫ్ఓ వరకు కొత్త నిబంధనలు




- సామాన్యుడి జేబుపై నేరుగా ప్రభావం చూపే అంశాలివే..
- ముందే జాగ్రత్త పడకపోతే ఆర్థిక నష్టాలు తప్పవు!

బిజినెస్ డెస్క్

మార్చి 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం (2026–27) ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు కీలకమైన ఆర్థిక నిబంధనలు మారబోతున్నాయి. ఆదాయపు పన్ను మొదలుకొని, బ్యాంకింగ్, పెట్టుబడుల వరకు అనేక అంశాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. సామాన్యుడి జేబుపై నేరుగా ప్రభావం చూపే ఈ కొత్త రూల్స్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం ఎంతో అవసరం. ఆ మార్పులేంటో ఇక్కడ చూద్దాం..

### కొత్త పన్ను విధానమే డిఫాల్ట్

ఏప్రిల్ 1 నుంచి ఆదాయపు పన్నుకు సంబంధించి 'కొత్త పన్ను విధానం' డిఫాల్ట్ ఆప్షన్‌గా మారుతుంది. పాత పన్ను విధానం కావాలనుకునే వారు ప్రత్యేకంగా దాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. లేకపోతే ఆటోమేటిక్‌గా కొత్త విధానంలోకి మారిపోతారు. ఉద్యోగులు తమ సంస్థలకు ముందే ఈ విషయాన్ని స్పష్టం చేయాలి. ఏ విధానం ఎంచుకుంటే పన్ను ఆదా అవుతుందో ముందే లెక్కలు వేసుకోవడం మంచిది.

### ఈపీఎఫ్ఓ ఖాతాల ఆటోమేటిక్ బదిలీ

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఖాతాదారులకు ఇది గొప్ప ఊరట. ఏప్రిల్ 1 నుంచి 1 కంపెనీలో ఉద్యోగం మానేసి వేరే కంపెనీలో చేరినప్పుడు, పాత ఈపీఎఫ్ ఖాతాలోని డబ్బు ఆటోమేటిక్‌గా కొత్త ఖాతాలోకి బదిలీ అవుతుంది. గతంలోలాగా దీనికోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఈ నిబంధనతో కోట్లాది మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది.

### ఫాస్టాగ్ కేవైసీ తప్పనిసరి

వాహనదారులకు ఇది చాలా ముఖ్యమైన గమనిక. ఏప్రిల్ 1 నాటికి ఫాస్టాగ్ కేవైసీ (నో యువర్ కస్టమర్) అప్‌డేట్ చేసుకోకపోతే, ఆ ఖాతాలు పనిచేయవు. బ్యాంకులు ఇప్పటికే ఖాతాదారులకు ఈ మేరకు మెసేజ్‌లు పంపుతున్నాయి. కేవైసీ పూర్తి చేయని ఫాస్టాగ్‌లను టోల్ ప్లాజాల వద్ద బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది.

### ఎన్పీఎస్ ఖాతాలకు టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్పీఎస్) ఖాతాల్లో భద్రతను పెంచేందుకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ ఏప్రిల్ 1 నుంచి టూ–ఫ్యాక్టర్ అథెంటికేషన్ విధానాన్ని తీసుకొస్తోంది. ఇప్పటివరకు కేవలం ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యే అవకాశం ఉండేది. ఇకపై పాస్‌వర్డ్‌తో పాటు ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని కూడా తప్పనిసరిగా నమోదు చేయాలి.

### క్రెడిట్ కార్డుల నిబంధనల్లో మార్పులు

చాలా బ్యాంకులు తమ క్రెడిట్ కార్డుల నిబంధనలను ఏప్రిల్ నుంచి మారుస్తున్నాయి. ముఖ్యంగా విమానాశ్రయాల్లోని లాంజ్ యాక్సెస్, కార్డులపై వచ్చే రివార్డ్ పాయింట్ల విషయంలో కఠిన నిబంధనలు అమలు కానున్నాయి. గత 1 నెలలో కనీస ఖర్చు చేస్తేనే ఉచిత లాంజ్ యాక్సెస్ ఇచ్చేలా ఎస్బీఐ, ఐసీఐసీఐ లాంటి బ్యాంకులు కొత్త రూల్స్ పెట్టాయి.

### మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై ఆంక్షలు

మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులు మార్చి 31 లోపు తమ పాన్, ఆధార్ వివరాలతో కేవైసీ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఏప్రిల్ 1 నుంచి ఇబ్బందులు తప్పవు. కేవైసీ లేని ఖాతాల నుంచి కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి కుదరదు. ప్రతి నెలా కట్ అయ్యే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) లావాదేవీలు కూడా మధ్యలోనే ఆగిపోయే ప్రమాదం ఉంది.

# భయపెడుతున్న యుద్ధం!

**కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు..**




- ఒకే రోజు 1636 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 22331 వద్ద ముగిసిన నిఫ్టీ.. బ్యాంకింగ్ షేర్ల కుదేలు
- 95 దాటేసిన రూపాయి.. భగ్గుమన్న ముడిచమురు
- మదుపర్ల సంపద భారీగా ఆవిరి.. ఇదే కారణాలు..

బిజినెస్ డెస్క్

దేశీయ స్టాక్ మార్కెట్లలో సోమవారం రక్తపాతం నెలకొంది. అంతర్జాతీయంగా నెలకొన్న తీవ్ర ప్రతికూల పరిస్థితుల దెబ్బకు సూచీలు పేకమేడలా కుప్పకూలాయి. ముఖ్యంగా అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధ భయాలు మదుపర్లను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. దీనికి తోడు ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకడం, రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్టానికి పడిపోవడం మార్కెట్ల పతనానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజున మార్కెట్లు ఈ స్థాయిలో పతనం కావడం మదుపర్లకు తీవ్ర నిరాశను మిగిల్చింది. ఉదయం నష్టాలతోనే ప్రారంభమైన సూచీలు.. రోజంతా అదే తీరును కొనసాగించి భారీ నష్టాలతో ముగిశాయి.

### పతనమైన సూచీలు ఇవే..

బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1636 పాయింట్లు పతనం చెంది 71947 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ 488 పాయింట్లు కోల్పోయి 22331 వద్ద స్థిరపడింది. మార్కెట్ ఆరంభం నుంచే అమ్మకాల వెల్లువ కనిపించింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటోమొబైల్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, ఎస్బీఐ, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మార్చి 31న మహావీర్ జయంతి సందర్భంగా మార్కెట్లకు సెలవు కావడంతో.. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025–26) ఇదే చివరి ట్రేడింగ్ రోజుగా నిలిచింది. వరుసగా రెండు సెషన్లలో సెన్సెక్స్ 3326 పాయింట్లు కోల్పోవడం గమనార్హం.

### మార్కెట్ల పతనానికి ప్రధాన కారణాలు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. మధ్యప్రాచ్యానికి అమెరికా అదనపు బలగాలను పంపుతోందన్న వార్తలు ప్రపంచ మార్కెట్లను వణికించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో యుద్ధం మరింత కాలం కొనసాగే ప్రమాదం ఉందన్న ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఆ ప్రభావం ఆసియా, యూరప్, అమెరికా మార్కెట్లపై తీవ్రంగా పడింది. విదేశీ మార్కెట్లు పతనం కావడంతో దేశీయ మార్కెట్లలోనూ ఆ భయం స్పష్టంగా కనిపించింది.

### ఆకాశాన్ని తాకుతున్న ముడిచమురు ధరలు

యుద్ధం కారణంగా గల్ఫ్ ప్రాంతం నుంచి చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న భయంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మండిపోతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా బ్యారెల్‌కు 115 డాలర్లు దాటేసింది. మన దేశం ఎక్కువగా చమురు దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో.. ఈ ధరల పెరుగుదల దేశ ఆర్థిక వ్యవస్థకు, ద్రవ్యోల్బణానికి తీవ్ర ముప్పుగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### చారిత్రక కనిష్టానికి రూపాయి.. పరుగుపెడుతున్న విదేశీ నిధులు

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రలో తొలిసారిగా 95 మార్కును దాటేసింది. ఒకే రోజు భారీగా పతనం చెంది 95.23 స్థాయికి పడిపోయింది. రూపాయి పతనం, ముడిచమురు ధరల పెరుగుదల కారణంగా విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మన మార్కెట్ల నుంచి తమ నిధులను భారీగా వెనక్కి తీసుకుంటున్నారు. క్రితం సెషన్‌లో ఒక్కరోజే వీరు 4367 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించారు. ఈ నెలలో రికార్డు స్థాయిలో విదేశీ నిధులు వెనక్కి వెళ్లడం మార్కెట్లను కుంగదీస్తోంది.

### ఆర్బీఐ నిర్ణయంతో కుప్పకూలిన బ్యాంకింగ్ షేర్లు

దేశీయ విదేశీ మారకద్రవ్య మార్కెట్లో బ్యాంకుల నికర ఓపెన్ పొజిషన్ల పరిమితిని 100 మిలియన్ డాలర్లకు పరిమితం చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న తాజా నిర్ణయం బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ నిర్ణయంతో బ్యాంకులు తమ వద్ద ఉన్న డాలర్లను విక్రయించాల్సి రావడం వల్ల ఆ రంగం షేర్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకున్నాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ దాదాపు 3.82 శాతం పతనం కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

### ఆవిరైన లక్షల కోట్ల సంపద

సోమవారం నాటి భారీ పతనంతో మదుపర్ల సంపద ఆవిరైపోయింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే దాదాపు 9 లక్షల కోట్ల రూపాయల మేర కరిగిపోయింది. గత రెండు సెషన్లను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 18 లక్షల కోట్ల రూపాయల సంపద తుడిచిపెట్టుకుపోయింది. చిన్న, మధ్య తరహా షేర్లలోనూ తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 2.5 శాతానికి పైగా నష్టపోయాయి. భవిష్యత్తులో యుద్ధ వాతావరణం సద్దుమణిగి, ముడిచమురు ధరలు అదుపులోకి వస్తే తప్ప మార్కెట్లు కోలుకునే పరిస్థితి కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అప్పటివరకు మదుపర్లు ఆచితూచి అడుగువేయాలని సూచిస్తున్నారు.



# పసిడికి బ్రేక్.. వెండి స్థిరం!

**కొద్దిగా తగ్గిన బంగారం ధరలు.. కేజీ వెండి 2,50,000**

**హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ 1,47,280**

- యుద్ధ భయాలు, అంతర్జాతీయ పరిణామాలే అమాంతం పెరుగుదలకు కారణం
- పెట్టుబడిదారుల్లో తీవ్ర ఆందోళన

బిజినెస్ డెస్క్

గత కొన్ని రోజులుగా చుక్కలు చూపిస్తున్న పసిడి ధరలు సోమవారం కాస్త శాంతించాయి. రికార్డు స్థాయిల నుంచి స్వల్పంగా కిందికి దిగివచ్చాయి. అటు వెండి ధరల్లో పెద్దగా మార్పులు నమోదు కాలేదు. అంతర్జాతీయంగా నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై నెలకొన్న సందిగ్ధత దేశీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరల్లో తీవ్ర ఒడిదొడుకులకు దారితీస్తున్నాయి. ముడిచమురు ధరల పెరుగుదల, డాలర్ బలపడటంతో మదుపర్లు ఆచితూచి అడుగులేస్తున్నారు.

### హైదరాబాద్‌లో ధరలు ఇవే..

స్థానిక హైదరాబాద్ మార్కెట్లో సోమవారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 1 గ్రాము ధర 81 రూపాయలు తగ్గి 14,728 వద్దకు చేరుకుంది. దీంతో 10 గ్రాముల ధర 1,47,280 పలికింది. ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం 1 గ్రాము ధర 75 రూపాయలు తగ్గి 13,500 కు చేరింది. 10 గ్రాముల ధర 1,35,000 వద్ద నమోదైంది. అలాగే 18 క్యారెట్ల బంగారం 1 గ్రాము ధర 11,046 వద్ద కొనసాగుతోంది. మరోవైపు వెండి ధరల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. 1 కిలో వెండి ధర 2,50,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. 1 గ్రాము వెండి 250 రూపాయలు, 10 గ్రాముల వెండి 2,500 పలుకుతోంది.

### మార్చి నెలలో రికార్డుల మోత..

ఈ మార్చి నెలలో పసిడి, వెండి ధరలు మునుపెన్నడూ లేని విధంగా చారిత్రక గరిష్టాలను తాకాయి. నెల ప్రారంభంలో 24 క్యారెట్ల బంగారం 1 గ్రాము ఏకంగా 17,308 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. వెండి కూడా ఏకంగా 1 కిలో 3,15,000 రూపాయల స్థాయికి చేరి అందరినీ కంగుతినిపించింది. ఆ తర్వాత కొద్దిరోజులుగా క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. అయినప్పటికీ సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనాలంటేనే భయపడే స్థాయిలో ధరలు కొనసాగుతుండటం గమనార్హం.

### ధరల హెచ్చుతగ్గులకు ప్రధాన కారణాలివే..

బంగారం, వెండి ధరలు ఇంతలా హెచ్చుతగ్గులకు లోనుకావడానికి ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలే కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు:** అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధ వాతావరణం ఇన్వెస్టర్లను భయపెడుతోంది. ఇలాంటి సంక్షోభ సమయాల్లో షేర్ల కన్నా బంగారాన్నే సురక్షితమైన పెట్టుబడిగా భావించి కొనుగోళ్లు పెంచుతారు. దీనివల్ల మధ్యలో ధరలు అమాంతం పెరిగాయి.

**మండిపోతున్న క్రూడాయిల్:** గల్ఫ్ ప్రాంతంలో యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్లు దాటింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**వడ్డీ రేట్ల తగ్గింపుపై సందిగ్ధత:** ద్రవ్యోల్బణం భయాలతో అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశం లేదన్న వార్తలు వస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ రేట్లు అలాగే ఉంచుతారన్న అంచనాలతో డాలర్ ఇండెక్స్ బలపడింది. ఫలితంగా బంగారం, వెండి ధరలు గరిష్టాల నుంచి కాస్త కిందకు దిగొచ్చాయి.

భవిష్యత్తులో యుద్ధ వాతావరణం మరింత ముదిరితే పసిడి ధరలు మళ్లీ రికార్డులను బద్దలు కొట్టే ప్రమాదం లేకపోలేదని బులియన్ మార్కెట్ పండితులు అంచనా వేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఈ ధరల పెరుగుదల సామాన్యులకు తీవ్ర భారంగా మారుతోంది.



# గర్ల్ ఫ్రెండ్‌కు భారీ గిఫ్ట్

**మహికా శర్మకు 1.7 కోట్ల లగ్జరీ కారు గిఫ్ట్ ఇచ్చిన హార్దిక్ పాండ్యా!**

**ముంబై:** టీమ్ ఇండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా మరోసారి వార్తల్లో నిలిచారు. తన విలాసవంతమైన జీవనశైలితో ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షించే పాండ్యా, తాజాగా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు అత్యంత ఖరీదైన కానుకను అందజేశారు. సుమారు రూ. 1.7 కోట్ల విలువైన మెర్సిడెస్ బెంజ్ వీ-క్లాస్ లగ్జరీ కారును ఆమెకు బహుమతిగా ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు. ఇటీవలే రూ. 12 కోట్ల విలువైన అల్ట్రా లగ్జరీ ఫెరారీ కారును సొంతం చేసుకున్న పాండ్యా, తక్కువ వ్యవధిలోనే ఈ ఖరీదైన గిఫ్ట్ ఇవ్వడం విశేషం. కొత్త కారుతో పాండ్యా-మహి కా దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలను చూసిన అభిమానులు రకరకాలుగా స్పందిస్తున్నారు. మరోవైపు, ఐపీఎల్‌లోనూ హార్దిక్ జోరు కొనసాగిస్తున్నారు. ఆదివారం వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో హార్దిక్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ జట్టు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అటు మైదానంలో విజయాలు, ఇటు వ్యక్తిగత జీవితంలో లగ్జరీ గిఫ్ట్‌లతో హార్దిక్ పాండ్యా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తున్నారు.

# సబలెంకా సన్‌షైన్ డబుల్

**మియామి ఓపెన్ టైటిల్ కైవసం**

**మియామి (యూఎస్‌ఏ) :** టాప్ సీడ్ అరీనా సబలెంకా ఖాతాలో మరో ఘనత. ఇటీవలే ఇండియన్ వెల్స్ గెలిచిన ఈ బెలారస్ బామ.. తాజాగా ఆదివారం ముగిసిన మియామి ఓపెన్‌లోనూ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుని 'సన్‌షైన్ డబుల్' సాధించింది. ఫైనల్‌లో సబలెంకా.. 6-2, 4-6, 6-3తో నాలుగో సీడ్ కోకో గాఫ్ (యూఎస్‌ఏ)ను చిత్తుచేసింది. టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్ తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నీల (ఇండియానా వెల్స్, మియామి ఓపెన్)ను ఒకే సీజన్‌లో గెలిచిన ప్లేయర్లకు సన్‌షైన్ డబుల్ గెలిచిన ఆటగాళ్లుగా గుర్తింపు దక్కుతుంది. 2022లో పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్ (మొత్తంగా ఐదో) క్రీడాకారిణీగా రికార్డులకెక్కింది.



# సీఎస్‌కేకు షాక్!

## బర్సపారలో రాయల్స్ హవా..

**వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ..**
**8 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం.**





**టాస్ నిర్ణయం సరైంది**

ఈ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నారు. బర్స పార పిచ్ సాధారణంగా భారీ స్కోర్లకు అనుకూలిస్తుంది. కానీ ఇక్కడ రాయల్స్ బౌలర్లు మొదటి ఓవర్ నుండే ఒత్తిడిని పెంచి సీఎస్ కే బ్యాటర్లను నియంత్రించడంలో విజయం సాధించారు. జోఫ్రా ఆర్చర్, నంద్రే బర్గర్, అన్షుల్ కాంబోజ్‌తో కూడిన పేస్ దళం, రవీంద్ర జడేజా, జూరెల్ ల స్పిన్ దాడి సీఎస్‌కేకు పెద్ద సమస్యగా మారింది. ఈ పిచ్ పై స్కోర్ తక్కువగా ఉన్నప్పటికీ బౌలర్లకు కొంతవరకు సహకారం లభించినట్లుంది.

**గౌహతి:** లోని బర్సపార స్టేడియంలో మార్చి 30న జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ (కేవలం 17 బంతుల్లో 52 పరుగులు) ఈ మ్యాచ్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విజయం రాయల్స్ కు పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపరచుకోవడంలో సహాయపడగా.. సీఎస్ కేకు ఈ ఓటమి ఒక పెద్ద హెచ్చరికగా మారింది.

**సీఎస్ కే బ్యాటింగ్ వైఫల్యం.. జేమీ ఓవర్టన్ ఒంటరి పోరాటం**

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోరు సాధించడంలో విఫలమైంది. మొదటి ఓవర్ నుండే రాయల్స్ బౌలర్లు తమ దూకుడును ప్రదర్శించి



సీఎస్ కే వికెట్లను వెంటవెంటనే పడగొట్టారు. జేమీ ఓవర్టన్ ఒక చివరన పోరాడి 43 (36 బంతుల్లో) పరుగులు చేసి సీఎస్ కేకు కొంత గౌరవప్రదమైన స్కోరు అందించారు. కానీ ఇతర బ్యాటర్ల నుండి ఆయనకు సరైన మద్దతు లభించలేదు. కార్తీక్ శర్మ (18), సర్ఫరాజ్ ఖాన్ (17) కొంతవరకు ప్రయత్నించారు. రవీంద్ర జడేజా రాయల్స్ తరపున ఆడటం ఈ మ్యాచ్ లో అత్యంత ఆసక్తికరమైన అంశం. జడేజా రాయల్స్ తరపున బౌలింగ్ చేసి కీలకమైన 2 వికెట్లు (2/18, 3 ఓవర్లలో) పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్ (2/19), నంద్రే బర్గర్ (2/26), అన్షుల్ కాంబోజ్ (2/27) కూడా రెండు వికెట్లు చొప్పున పడగొట్టి సీఎస్ కేకు భారీ షాక్ ఇచ్చారు. ఫలితంగా సీఎస్ కే 19.4 ఓవర్లలో కేవలం 127 పరుగులకే ఆలౌట్ అయింది.

**రాయల్స్ విధ్వంసం.. వైభవ్ సూర్యవంశీ తుఫాను ఇన్నింగ్స్**

128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించడానికి రాజస్థాన్ రాయల్స్ బరిలోకి దిగింది. వారు లక్ష్య ఛేదనను ఒక సాధారణ వ్యవహారంగా మార్చేశారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మొదటి బంతి నుండి సీఎస్ కే బౌలర్లకు చుక్కలు చూపించారు. కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడారు. ఈ యువ ఆటగాడి దూకుడు, షాట్ ఎంపిక చాలా అద్భుతంగా ఉన్నాయి. అతని పేలుడు ఆరంభం రాయల్స్ కు విజయానికి మంచి పునాది వేసింది. సూర్యవంశీ అవుట్ అయిన తర్వాత యశస్వి జైస్వాల్ సంయమనంతో బ్యాటింగ్ చేశారు. ఆయన 38 (36 బంతుల్లో) పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. ధ్రువ్ జురెల్ కూడా 18 (9 బంతుల్లో) పరుగులు చేశారు. ధ్రువ్ జురెల్ అవుట్ అయ్యాక జైస్వాల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్ ను సురక్షితంగా ముగించారు. రాయల్స్ కేవలం 12.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసి విజయం సాధించింది. వారు 47 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్ ను ముగించారు.



# డబ్ల్యూటీటీ కంటెండర్ ట్యూనిషియా



**రన్నరప్‌గా మనూష్-దివ్య జోడీ..**
**పురుషుల డబుల్స్ ఫైనల్లో మనూష్-హర్మీత్!**

**ఢిల్లీ:** ట్యూనిషియా వేదికగా జరుగుతున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ ట్యూనిస్-2026 టోర్నీలో భారత ప్యాడ్లర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ఆదివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌లో భారత అగ్రశ్రేణి జోడీ మనూష్ షా, దివ్య చిటాలె పోరాడి ఓడి రన్నరప్‌గా నిలిచారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ తుది పోరులో స్పెయిన్‌కు చెందిన అల్వారో రుబెల్స్, మరియా షావో జోడీ 3-1 (11-9, 11-13, 12-10, 11-5) తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. తొలి గేమ్ కోల్పోయిన తర్వాత రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం స్కోరును సమం చేసినప్పటికీ, నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పాయింట్ల వేటలో వెనుకబడి రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ఇప్పటికే మస్కట్ కంటెండర్ టైటిల్ గెలిచిన మనూష్-దివ్య జోడీకి ఇది మరో మెరుగైన ఫలితం.

**పురుషుల డబుల్స్‌లో టైటిల్ వేట:**

మరోవైపు పురుషుల డబుల్స్‌లో మనూష్ షా, హర్మీత్ దేశాయ్ జోడీ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శనివారం రాత్రి జరిగిన సెమీఫైనల్‌లో భారత జోడీల మధ్యే హోరాహోరీ పోరు సాగింది. ఇందులో రెండో సీడ్ మనూష్-హర్మీత్ ద్వయం 3-2 (9-11, 5-11, 11-7, 11-5, 11-8) తేడాతో భారత్‌కే చెందిన స్నేహిత్-ఆకాష్ జోడీపై అద్భుతమైన 'కమ్ బ్యాక్' విజయాన్ని నమోదు చేసింది. తొలి రెండు గేమ్‌లు కోల్పోయినప్పటికీ, పట్టువదలని విక్రమార్కుల్లా వరుసగా మూడు గేమ్‌లు గెలిచి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఫైనల్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఫ్లోరియన్ బౌరాసాడ్, ఎస్టెబన్ డోర్ జోడీతో వీరు తలపడ్డారు.

# ప్రజ్ఞానంద బోణీ..

## అనీశ్ గిరిపై విజయం

**సైప్రస్ :** ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద అదిరిపోయే బోణీ కొట్టాడు. ఆదివారం జరిగిన ఓపెన్ కేటగిరీ తొలి పోరులో ప్రజ్ఞానంద 1-0 తేడాతో నెదర్లాండ్స్ జీఎం అనీశ్ గిరిపై అద్భుత విజయం సాధించాడు. తన కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న గిరిపై ప్రజ్ఞానంద తనదైన ఆధిపత్యం ప్రదర్శించాడు. గేమ్‌లో ఒక దశలో గిరి ఆధిక్యం కనబరిచినా అతను చేసిన తప్పిదాన్ని అనుకూలంగా మలుచుకున్న ప్రజ్ఞానంద విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు మహిళల కేటగిరీలో దివ్యాదేశ్‌ముఖ్..అన్నా ముజుచిక్‌తో గేమ్ డ్రా చేసుకోగా, వైశాలి రాంబాబు, బిబిసారా అసబుయేయా మధ్య గేమ్ డ్రాగా ముగిసింది.






## సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ప్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.



## చిరుతో మరోమారు బాబీ సినిమా

మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.

## ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.



## సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.




## ఓటీటీలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేదని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.

## రూ.1,365 కోట్లు సాధించిన ధురంధర్ 2

### దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పుట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు. కళ్లెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

నేటి సాక్షి
కరీంనగర్
మంగళవారం
30 మార్చి 2026

# డ్రగ్ రహిత తెలంగాణే ధ్యేయం

- మాదకద్రవ్యాల నివారణకు ప్రతి పౌరుడు బాధ్యతగా పనిచేయాలి
- డ్రగ్స్ సమాచారం కోసం '1908'కు ఫిర్యాదు చేయండి: డీఎస్పీ సైదులు



**నేటి సాక్షి, మరికల్,(ఇమామ్ సాబ్):** మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్రం నుండి తరిమికొట్టి, డ్రగ్ రహిత తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ యాంటీ నార్కోటిక్ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సైదులు అన్నారు. సోమవారం మరికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యార్థులు, ప్రజలకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ సైదులు మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడటం వల్ల మెదడు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయంపై తీవ్ర ప్రభావం చూపి ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తులను, కుటుంబాలను మరియు సమాజాన్ని బలహీనపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సరఫరా లేదా వాడకంపై సమాచారం ఉంటే వెంటనే 1908 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. విద్యార్థులను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రభుత్వం అన్ని హైస్కూళ్లలో 'ప్రహరీ క్లబ్'లు, యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. విద్యాసంస్థల సమీపంలో డ్రగ్స్ విక్రయాలను పూర్తిగా నిషేధించడమే వీటి లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేసి, అందరితో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మరికల్ సీఐ భగవంతు రెడ్డి, ఎస్సై రాములు, ఎంఈఓ ఫరీద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ చెన్నయ్య, ఉపసర్పంచ్ కాజా, యువజన సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా



- మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు
- కొల్గూరులో చెక్కులు పంపిణీ చేసిన సర్పంచ్ గొడుగు జ్యోతి స్వామి

**నేటి సాక్షి, గజ్వేల్:** గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, సహకారంతో మంజూరైన ఈ ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ గొడుగు జ్యోతి స్వామి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గొడుగు అంజమ్మకు రూ. 22,500, దాకాని స్వామికి రూ. 39,000 మరియు ఎరుకలి శ్రీనుకు రూ. 5,000 విలువైన చెక్కులను అందజేశారు. అనారోగ్యం కారణంగా భారీగా వైద్య ఖర్చులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఈ కుటుంబాలకు ప్రభుత్వం అందించిన ఈ సాయం ఎంతో ఊరటనిస్తుందని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి స్వామి మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా గ్రామ స్థాయిలో పూర్తి సహకారం అందిస్తామన్నారు. వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడే అర్హులైన వారు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమకు అండగా నిలిచిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు, ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నిమ్మరాజ్ లక్ష్మి నర్సయ్య, వార్డు సభ్యులు బాల్‌రాజు, శెట్టి స్వామి, నారాయణరెడ్డి, ముత్తయ్య, నారాయణ, కనకయ్య, రాజయ్య, స్వామి మరియు కారోబార్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మైలారంలో రూ. 15 లక్షలతో అభివృద్ధి బాట

- కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో రూ. 15 లక్షల నిధులు మంజూరు
- గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం. సర్పంచ్ గాలిపెల్లి పోశవ్వ



**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని మైలారం గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో మంజూరైన రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ గాలిపెల్లి పోశవ్వ నరసయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గతంలో వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయమై ప్రజలు నడవలేని పరిస్థితి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థుల ఇబ్బందులను గుర్తించి, పంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే నిధులు కేటాయించారని తెలిపారు. తమ గ్రామానికి రూ. 15 లక్షలు మంజూరు చేసినందుకు మంత్రి బండి సంజయ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో గ్రామంలోని అన్ని వీధుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం భారతి, వార్డు సభ్యులు నిషాని రేణుక, గాలిపెల్లి సతీష్, కొంకటి రవి, మైసంపల్లి తిరుపతి, జక్కనపల్లి లక్ష్మి, విలాసాగర్ కోటి, కవిత పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్ దొడ్డు మల్లేశం, వడ్నాల నరసయ్య, వారాల మల్లేశం, దుడ్డు నాగరాజ్, నూకల రవి, రామచంద్రం, బుర్ర శ్రీనివాస్ గౌడ్, మహేష్, లక్ష్మీరాజ్యం, గాలిపెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



- అసెంబ్లీలో తీర్మానం చేయాలని సిఐటియు డిమాండ్
- సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద రాస్తారోకో.. ప్రభుత్వంపై నిప్పులు

**నేటి సాక్షి, సిరిసిల,(శివకుమార్):** ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనాన్ని నిర్ణయించి, అసెంబ్లీలో తీర్మానం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఆశా వర్కర్లు భారీ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆశాల పట్ల ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడం అమానుషమని మండిపడ్డారు. హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. వేతనం పెంపుతో పాటు పనిభారాన్ని తగ్గించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆశా వర్కర్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల పాల్గొన్నారు. అలాగే సిఐటియు నాయకులు సూరం పద్మ, బూర శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల, యూనియన్ నాయకురాలు భారతి, గాయత్రి, చంద్రకళ, జమున, లావణ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

పేదల సొంతింటి కల నెరవేరుతోంది..



**నేటి సాక్షి, మరికల్,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని ఒకటో వార్డులో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. నారాయణపేట ఎమ్మెల్యే డాక్టరు చిట్టెం పర్ణికా రెడ్డి సహకారంతో, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గుప చెన్నయ్య, వార్డు సభ్యురాలు పెంటమీది రాజేశ్వరి రఘు దంపతులు జంగిడి పుష్పమ్మ-శంకరప్పల నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేరుతుందని తెలిపారు. ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బెల్లగొంది వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్, వార్డు సభ్యులు వసంత, చంద్రకళ, పోలేమోని అశోక్, బొందలకుంట రాజు, సీనియర్ నాయకులు పెంటమీది రవి, రామకృష్ణారెడ్డి, రఘు, శ్రీనివాసులు, బాల్ రెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి సహకరించాలి

పసుపుల గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**నేటి సాక్షి, పసుపుల,(ఇమామ్ సాబ్):** మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం గ్రామంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నిధుల నుంచి మంజూరైన రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నామని, వీటిని నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి చేస్తోందని, ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్ కుమార్, గ్రామ వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలను తనిఖీ

రెవిన్యూ ఆర్ ఐ శ్వేత



**నేటి సాక్షి.చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని జై జై నగర్ ప్రాథమిక పాఠశాల లో మధ్యాహ్న భోజనం భాగంగా ఈరోజు పిల్లల పోషణ నిమిత్తం రెవెన్యూ ఆర్ ఐ శ్వేత తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు నమోదు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు విద్యా కార్యక్రమాలు వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పిల్లలకు అందుతుందనే అంశాన్ని పరిశీలించారు. మరింత మెరుగుదలకు అవసరమైన సూచనలు చేశారు. పిల్లల ఆరోగ్యం, అభివృద్ధి విషయంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంల రెవెన్యూ ఆర్ ఐ శ్వేత కార్యదర్శి షరుబుద్దిన్ వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | మంగళవారం 30 మార్చి 2026

# పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

## రాష్ట్ర ప్రభుత్వంపై పెన్షనర్ల అసంతృప్తి జ్వాలలు



**నేటి సాక్షి, కరీంనగర్:** తెలంగాణ రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందని, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మార్చి 2024 నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన డీఏ ఏరియర్స్, గ్రాట్యూటీ, కమ్యుటేషన్, టీజీఎల్ఐసీ, జీపీఎఫ్ మరియు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారికి, కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే చెల్లింపులు చేస్తున్నారని, సామాన్య పెన్షనర్ల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. సుమారు 100 మంది పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులతో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి గత ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు కావస్తున్నా పెన్షనర్ల కోసం చేసింది ఏమిటో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లను ఇబ్బంది పెట్టినందుకే కాంగ్రెస్‌ను గెలిపించారని, కానీ ప్రస్తుత పాలన కూడా అలాగే ఉండటం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి పెన్షనర్ల ఆర్థిక దీనస్థితిని గమనించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బకాయిలను తక్షణమే విడుదల చేసి, వృద్ధాప్యంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని జాలి మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇచ్చిన హామీలను అక్రమ అరెస్ట్

## బీజేపీ జిల్లా కార్యదర్శి తడుక అశోక్



**నేటిసాక్షి నల్లబెల్లి:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే ఉద్యమకారము అక్రమ అరెస్టు చేస్తున్నారని బిజెపి జిల్లా కార్యదర్శి తడుక అశోక్ గౌడ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆనాటి పది జిల్లాలలోని ఉద్యమకారులు నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుట కొరకు ఉద్యమం ఎక్కడ సడలకుండ పోరాటం చేసి స్వరాష్ట్రం సిద్ధించేదాక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటు పోలీసు కేసులు,లాటీలు తూటాల ను సైతం తట్టుకుంటూ కుటుంబాలను చిన్న భిన్నం చేసుకున్న తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఆరవ గ్యారెంటీ కింద ఉద్యమకారులకు పింఛన్ సౌకర్యం ఏర్పాటు చేస్తానని నమ్మబలికి నాడు. ఓట్లు దండుకొని నేడు పోలీసు అరెస్టులు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్ రెడ్డి ఏకే 47 రైఫిల్ పెట్టుకొని ఉద్యమకారులను అణచివేసే ప్రయత్నం చేసినాడని అలాంటి రేవంత్ రెడ్డి దొడ్డిదారిన గెలవడం కొరకు ఉద్యమకారులను పావులుగా వాడుకొని గద్దెనెక్కినాడని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అరెస్టులు కాకుండా ఉద్యమకారుల కోసం తగిన గుర్తింపుని ఇవ్వాలని లేనిచో ప్రభుత్వాన్ని ఉద్యమకారులు బొంద పెట్టే సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. అసలే తెలంగాణ ఉద్యమంలో నిరంతర పోరాటాలు చేసి రోగాల బారినపడి కుటుంబాలను వెళ్ళదీయలేక కాలం వెళ్లదీస్తున్న తెలంగాణ ఉద్యమకారులను నక్సలైట్ల వలె అరెస్టు చేయడం తగదన్నారు. ఉద్యమకారులు దేశద్రోహులు కారని ఇచ్చిన హామీలనే ప్రశ్నిస్తున్నందుకు ఇలా చేయడంమానుకోవాలని హితవుపలికారు. ప్రజాస్వామ్యవాదులు ప్రజలు ఉద్యమకారుల పక్షాన నిలిచి ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రజావాణికి పోటెత్తిన అర్జీలు

## ఒకే రోజు 205 దరఖాస్తులు



**నేటి సాక్షి, సిరిసిల్ల,(శివకుమార్):** రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రజల నుండి భారీ స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి అర్జీలను స్వీకరించారు. మొత్తం 205 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన అర్జీలలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 82 దరఖాస్తులు రాగా, గృహ నిర్మాణ శాఖకు 35, డీఆర్డీఓకు 30 అర్జీలు అందాయి. వీటితో పాటు జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, ఉపాధి కల్పన విభాగానికి 8, మున్సిపాలిటీ మరియు ఎస్పీ కార్యాలయాలకు ఐదు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. అలాగే విద్యా, వైద్య, నీటి పారుదల మరియు బీసీ సంక్షేమ శాఖలకు కూడా ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆయా విభాగాలకు పంపించామని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వహించకూడదని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం



- మెనూ కచ్చితంగా పాటించాలి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- దుమాల ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో ముఖాముఖి

**నేటి సాక్షి, ఎల్లారెడ్డిపేట,(శివకుమార్)** విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (జువీ=హా)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, భోజన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్టోర్ రూమ్‌లోకి వెళ్లి అక్కడ ఉన్న ఆహార సామగ్రి, కోడిగుడ్లు, కూరగాయల నాణ్యతను పరీక్షించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను చూసి, మెనూ ప్రకారం చికెన్, మటన్, గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. తరగతి గదులు, వసతి గదుల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ఒక ప్రణాళిక ప్రకారం ప్రిపేర్ అవ్వాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థుల పోషణ విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని, మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# పేదవాడి అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

- వేంపెంటలో ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు.. భారీ కేక్ కట్ చేసిన నేతలు



**నేటి సాక్షి, పాములపాడు:** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం దేశ రాజకీయ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని సింగిల్ విండో చైర్మన్ జే.వీ.లక్ష్మీకాంతరెడ్డి, టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు కంభం మోహన్ గౌడ్ అన్నారు. సోమవారం పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ వై.మాణిక్యమ్మ, యూనిట్ ఇంచార్జ్ ఎస్.ఆదిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అందించాలనే లక్ష్యంతో పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. పార్టీ పెట్టిన కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి దేశంలోనే రికార్డు సృష్టించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. గత 44 ఏళ్లుగా ఎన్నో కష్టనష్టాలు ఎదురైనా జెండాను వదలకుండా పోరాడుతున్న కార్యకర్తలకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో పతాక ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జె.రత్నమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సోమ్లా నాయక్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు విక్రమ్ గౌడ్, వార్డు సభ్యులు లెనిన్ బాబు, రమేష్, జోసెఫ్, విశ్రాంత ఉపాధ్యాయుడు ధానమయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామ నేతలు బాలస్వామి, చంద్రశేఖర్ గౌడ్, చిన్న ఎల్లసుబ్బుడు, వెంకటసుబ్బయ్య, మధు సుధాకర్, మహానంది, మల్లికార్జున నాయుడు, డాక్టర్ చంద్ర గౌడ్, శంకరాములు నాయక్, వెంకటేశ్వర రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదవాడి ఆకలి తీర్చడమే ఎన్టీఆర్ టిడిపి లక్ష్యం



- మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ
- తెలుగు ప్రజలందరికీ 44వ టిడిపి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన సింగపూర్ డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు

**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 44వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, సింగపూర్ తెలుగు సమాజానికి వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి. నాగేశ్వరరావు పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేశారు. మొదట మాజీ సర్పంచ్ టేకురి రామసుబ్బమ్మ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీకి జై కొడుతూ ఉత్సాహంగా పార్టీ జెండా ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలను ప్రారంభించారు. భారీ కేకును కటింగ్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకొని ఘనంగా సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏర్పాటు చేసిన సభలో స్టేట్ సివిల్ సప్లై తెలుగువారి ఆత్మగౌరవానికి నిలువుటద్దం తెలుగుదేశం పార్టీ అని అన్నారు. "పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నందమూరి తారకరామారావు 44 ఏళ్ల క్రితం ఈ పార్టీని స్థాపించారని. నాటి నుండి నేటి వరకు టీడీపీ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిందని తెలిపారు. "నాడు ఎన్టీఆర్ వేసిన పునాదిపై, నేడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధికి సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ జెండాను మోసిన కార్యకర్తలే బలం అని అన్నారు. త్యాగాల వల్లే పార్టీ నేడు ఈ స్థాయిలో ఉందని సీనియర్ నాయకుల అనుభవం, యువ నాయకత్వ ఉత్సాహం కలిసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అందరూ భాగస్వాములు కావాలని చేకూరి రామసుబ్బమ్మ పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుండి క్రమశిక్షణతో, నిబద్ధతతో పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నారని తెలిపారు. పార్టీ అభివృద్ధిలో వారి పాత్ర చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డీసీ)ఆల్ఫ్రెడ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, వేమా రెడ్డి,రమేష్ రెడ్డి, రత్నాకర్, బాలకృష్ణ ఆచారి, చిన్నస్వామి ఆచారి, యువరాజు, బోనాల భాస్కర్, టేకూరి భాస్కర్, నాగేశ్వర నాయక్,నెంబర్ లక్ష్మన్న, జీవన్న, ప్రసన్న కుమార్, జనసేన శేషు, శీలం శ్రీనివాసులు, చిరంజీవి గౌడ్, కిరణ్, సుబ్బారావు,శేషిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ చేయించుకోవాలి

- బజార్ వాడీలో మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్
- ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచన



**నేటి సాక్షి, ఆసిఫాబాద్ (ముబీన్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఐ.ఆర్ (SIR) మ్యాపింగ్ ప్రక్రియ పౌరులందరికీ అత్యంత కీలకమని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.డి. అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బజార్ వాడీలో జరుగుతున్న మ్యాపింగ్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వివరాలను నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎవరూ మిగిలిపోకుండా ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓలు లక్ష్మి, దేవమ్మ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అభిషేక్, సాయి, నాయకులు షబ్బీర్, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

# మిట్టకందాలలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు



- తెలుగువాడి ఆత్మగౌరవ ప్రతీక టీడీపీ.. ఎన్టీఆర్ ఆశయాలే మార్గదర్శకం
- జెండా ఆవిష్కరించి సంబరాలు చేసుకున్న మండల ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్ యాదవ్

**నేటి సాక్షి, పాములపాడు:** తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ జి.హరి ప్రసాద్ యాదవ్ అన్నారు. సోమవారం మిట్టకందాల గ్రామంలో పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానంద రెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య, సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డిల ఆదేశాల మేరకు పార్టీ జెండాను ఆవిష్కరించి, భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ యాదవ్, ఎస్సీ సెల్ కన్వీనర్ లింగాల నాగరాజు మాట్లాడుతూ.. 1982 మార్చి 29న ఎన్టీఆర్ పార్టీని స్థాపించి, రెండు రూపాయలకే కిలో బియ్యం, పక్కా ఇళ్ల నిర్మాణంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో 'దీపం' పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని, ఇప్పుడు 'సూపర్ సిక్స్' పథకాల ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని నేతలు స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బ్రతుకులయ్య, పార్టీ నాయకులు శ్రీనివాసులు, ఎల్.శివరాముడు, ఎల్.సురేష్, వి.వెంకటేశ్వర్లు, కోడుమూరు వెంకటేశ్వర్లు, వడ్డే శివరాముడు, వెంకట సుబ్బయ్య మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని వేడుకలను జయప్రదం చేశారు.

# పవిత్ర వారం ప్రారంభం

## పాములపాడులో క్రైస్తవుల సందడి

- యేసుక్రీస్తు జయధ్వానాలతో మార్మోగిన వీధులు
- 3500 మంది విశ్వాసులతో భారీ ర్యాలీ.. బ్రదర్ శాంసన్ ఎఫ్రా దైవసందేశం






**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండల కేంద్రంలో జెరూసలేం శాల మినిస్ట్రీ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. యేసుక్రీస్తు ఎరుషలేము పట్టణంలోకి విజయోత్సవంతో ప్రవేశించిన రోజును పురస్కరించుకొని, సంఘ వ్యవస్థాపకులు బ్రదర్ శాంసన్ ఎఫ్రా మరియు పాస్టర్ అమ్మ మణిమాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ నగర్ నుంచి మిట్టకందాల రోడ్డు మీదుగా ఏఎన్ఆర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ వరకు సుమారు 3500 మంది క్రైస్తవ విశ్వాసులు చేతుల్లో ఖర్జూర మట్టలు పట్టుకొని 'హోసన్నా' జయధ్వానాల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. ఈ సందర్భంగా బ్రదర్ శాంసన్ ఎఫ్రా దైవసందేశం ఇస్తూ.. సుమారు 2000 సంవత్సరాల క్రితం యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి కుష్టు రోగులకు, గుడ్డివారికి, సకల వ్యాధిగ్రస్తులకు స్వస్థత చేకూర్చారని కొనియాడారు. తన మరణానికి వారం ముందు ఆయన ఎరుషలేము పట్టణంలోకి ప్రవేశించినప్పుడు, ప్రజలు తమ వస్త్రాలను, ఖర్జూర కొమ్మలను దారిలో పరచి ఘనస్వాగతం పలికారని గుర్తుచేశారు. ఈ రోజు నుండే పవిత్ర వారం లేదా శ్రమల వారం ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ప్రజలు తాటి మట్టలు పరచి యేసుక్రీస్తుకు ఎలా స్వాగతం పలికారో, అలాగే మన హృదయాల్లో కూడా దేవునికి చోటు కల్పించాలని బ్రదర్ శాంసన్ కోరారు. చెడు ఆలోచనలకు బానిసలు కాకుండా, సన్మార్గంలో నడుస్తూ పరలోక రాజ్య వారసులు కావాలని పిలుపునిచ్చారు. మట్టల ఆదివారం నీతిమంతులకు సాదృశ్యమని, ఈ వేడుక ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. భారీ ఎత్తున జరిగిన ఈ ర్యాలీకి ఎటువంటి ఆటంకాలు కలగకుండా రక్షణ కల్పించిన పోలీసు సిబ్బందికి బ్రదర్ శాంసన్ ఎఫ్రా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, ఇంచార్జీలు, దైవ సేవకులు మరియు వేలాది మంది విశ్వాసులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# కంబాలపల్లెలో ఉరుసు సందడి.. ఏర్పాట్లు పూర్తి




- ముజావర్లు ఎస్.కరీముల్లా, ఎస్.మస్తాన్ వలి

**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలోని, కంబాలపల్లె గ్రామంలో ఏప్రిల్ 2, 3వ తేదీలలో 68వ మస్తాన్ వలి దర్గా ఉరుసు మహోత్సవము నిర్వహిస్తున్నట్లు ముజావర్లు ఎస్.కరీముల్లా, ఎస్ మస్తాన్ వలి, కమిటీ పెద్దలు కర్నూలు ఎస్.మహబూబ్ సాహెబ్, ఎర్రగూడూరు మంజుల వెంకటస్వామి కుమారులు, నందికొట్కూరు కే.కే.లింగన్న, ఆత్మకూరు టీ.మౌలాలి, గడివేముల ఎస్.ఖాజా హుస్సేన్, నాగలూటి ఎస్.షరీఫ్, రహిమాన్, పాములపాడు గాజుల నన్నేసా, తదితరు కమిటీ సభ్యులు మీడియా విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ముజావర్లు ఎస్.కరిముల్లా, ఎస్.మస్తాన్ వలి లు మాట్లాడుతూ ఏప్రిల్-2వ తేదీ గురువారం రాత్రి గంధం కార్యక్రమం ఉంటుందని, ఏప్రిల్ 3వ తేదీ శుక్రవారం ఉరుసు మహోత్సవము ఉంటుందని, రాత్రి 7 గంటలకు అన్నదాన కార్యక్రమం, ఇదే రోజు రాత్రి 10 గంటలకు ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఏప్రిల్- 4వ తేదీ శనివారం ఉదయం-7 గంటలకు జియారత్ నందు భక్త గ్రేసరులకు, సోదర, సోదరీమణులకు, గ్రామ పెద్దలకు కమిటీ కార్యవర్గ సభ్యులు తీర్థ ప్రసాదములు పంచడం జరుగుతుందన్నారు. కనుక హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ మతస్తులందరూ కుల, మతాలకతీతంగా పాల్గొని ఈ ఉరుసు మహోత్సవాన్ని జయప్రదం చేయవలసిందిగా అందరిని కోరుచున్నాము.

# మెనూ కచ్చితంగా పాటించాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్



**నేటి సాక్షి, ఎల్లారెడ్డిపేట,(శివకుమార్):** విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (జువీ=ూ)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, భోజన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్టోర్ రూమ్‌లోకి వెళ్లి అక్కడ ఉన్న ఆహార సామగ్రి, కోడిగుడ్లు, కూరగాయల నాణ్యతను పరీక్షించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను చూసి, మెనూ ప్రకారం చికెన్, మటన్, గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. తరగతి గదులు, వసతి గదుల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ఒక ప్రణాళిక ప్రకారం ప్రిపేర్ అవ్వాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థుల పోషణ విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని, మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# చంద్రమౌళికి పి4 ధ్రువీకరణ పత్రం



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెద్ద కొండా మరి మాజీ సర్పంచ్ పూల చంద్రమౌళికి పి ఫోర్ ధ్రువీకరణ పత్రం అందించి సత్కరించారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపును స్వాగతిస్తూ కోటూరు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి దిశగా పనులను ఆయన చేపట్టారు .ఇందుకుగాను నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరులో ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో పూల చంద్రమౌళికి పి4 ధ్రువీకరణ పత్రం ఎంపీడీవో లీలా మాధవి .అధికారులు నాయకులు అందించారు, దీంతో పలువురు ఆయనను అభినందించారు .ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేస్తానని ఈ సందర్భంగా పూల చంద్రమౌళి అన్నారు,

# సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్(ముబీన్):** మండలంలోని రాజంపేట గ్రామ పంచాయతీలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బూర్స పోచయ్యతో కలిసి ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ కొబ్బరి కాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మంగ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి దిశగా సీసీ రోడ్డు నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మారుతి పటేల్, వార్డు సభ్యులు జావేద్, మామిడి లక్ష్మీ, ప్రశాంత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదకి అండగా ఉంటాం

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు



**నేటి సాక్షి తొగుట,(వడ్డే నరసింహులు):** తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఇటీవల అకస్మాత్తుగా మరణించిన చాట్లపల్లి బాలమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పి 3000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనమైన అనిల్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు కంకణాల బాలకృష్ణ, కొయ్యడ స్వామి చరణ్ గౌడ్,మహ్మద్ షఫీ,యూత్ అధ్యక్షులు కళ్ళేపు నరేష్, సీనియర్ నాయకులు మిద్దె స్వామి, వోలపు సత్యనారాయణ,ఎర్రోళ్ల అర్జున్, వడ్డే నర్సింలు,జూపల్లి జహంగీర్, చాట్లపల్లి గాలయ్య,శివయ్య,బాలయ్య,నరేష్ తదితరులు పాల్గొన్నారు

# టోకెన్ ద్వారా ధాన్యం కొనుగోలు



**నేటి సాక్షి తొగుట.(వడ్డే నరసింహులు):** తొగుట మండలకేంద్రలోని వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు, మక్కజొన్న ధాన్యాలు స్వీకరణ నేటి నుండి టోకెన్ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభం చేసిన లిఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, ాావీజ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్య పడకండి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుంది అన్నారు ఎవరో వచ్చి రాజకీయ ఉనికి కోసం రెచ్చగొడితే రెచ్చిపోకండి నాడు నేడు రైతులకోసం పని చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి,ాావీజ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరీ నర్సింలు, కోపరేటివ్ స్పెషల్ ఆఫీసర్ రవి, మార్కెట్ కమిటీ సెక్రటరీ స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు భారత్ తేజ,మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, గంగారెడ్డి,సీనియర్ నాయకులు పబ్బతి మల్లారెడ్డి,భూపాల్ రెడ్డి ముక్కెర కనకయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరుఅందించాలి

## ఆర్డీవోకు విన్నపం



**నేటి సాక్షి, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో నిలిచిపోయిన డి-8 ఉప కాలువ పనులను తక్షణమే పూర్తి చేసి, సాగునీరు అందించాలని కోరుతూ మైలారం రైతులు సోమవారం కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 312, 313లలో కేవలం 10 మీటర్ల మేర కాలువ పనులు పూర్తి చేయకపోవడం వల్ల సుమారు 300 మంది రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ నిర్మాణం కోసం తాము భూములు కోల్పోయినప్పటికీ, పనులు నిలిచిపోవడం వల్ల పంటలకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని, చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తోట కోటేశ్వర్, జక్కన్న పెల్లి సత్తయ్య, ఈరవేణి తిరుపతి, తోట పవన్, సుద్దాల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# నీలిమ మృతి చాలా బాధాకరం

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు



**నేటి సాక్షి, తొగుట(వడ్డే నర్సింలు):** తొగుట మండలంలోని చందాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మరణించిన బొడ్డు నీలిమ కుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు పరామర్శించారు. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించారు శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పి 3000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. చిన్న వయసులో నీలిమ అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమని అన్నారు కార్యక్రమంలో నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చందా సత్తయ్య, బండారు రమేష్ గౌడ్,ఆత్మకూరి రాజు, షాహిన్ పాషా,బొడ్డు నర్సింలు పాత్కుల వెంకటేశం, జంగపల్లి ఆంజనేయులు, కల్లేపు నరేష్, బెజుగమ కిష్టయ్య, కుమ్మరి చంద్రం, పోతరాజు రవి, కల్లెపు భాను చందర్, వడ్డే నర్సింలు, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# సహాయనిధి నిరుపేదలకు వరం

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి



**నేటి సాక్షి,తొగుట(వడ్డే నరసింహులు):** తొగుట మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన పదిమంది లబ్ధిదారులకు సంబంధించిన మొత్తం రూపాయలు 289500/- రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి గార్లతో కలిసి దుబ్బాక నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరీ నర్సింలు, గ్రామ పార్టీ అధ్యక్షులు భారత్ తేజ,సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి,సిద్ధి శ్రీనకర్, మల్లా రెడ్డి, ముక్కెర కనకయ్, తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి ఆకలి తీర్చడమే తెలుగుదేశం లక్ష్యం



- పాములపాడులో ఘనంగా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు
- ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు
- పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలే అసలైన బలం: మహేష్ నాయుడు

**నేటి సాక్షి,పాములపాడు:** నంద్యాల జిల్లా పాములపాడు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల టీడీపి నాయకులు మధు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పార్టీకి జై కొడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం, పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మహేష్ నాయుడు మాట్లాడుతూ, తెలుగువారి ఆత్మగౌరవానికి నిలువుటద్దం తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. "పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నందమూరి తారకరామారావు గారు 44 ఏళ్ల క్రితం ఈ పార్టీని స్థాపించారు. నాటి నుండి నేటి వరకు టీడీపీ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది" అని తెలిపారు. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ జెండాను మోసిన కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, వారి త్యాగాల వల్లే పార్టీ నేడు ఈ స్థాయిలో ఉందని ఆయన అన్నారు. సీనియర్ల అనుభవం, యువత ఉత్సాహం కలిసి పార్టీని మరింత బలోపేతం చేయాలని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఇంచార్జి విక్టర్, తర్తూరు హనుమంత్ రెడ్డి, పోతులపాడు శివానంద రెడ్డి, లింగేశ్ గౌడ్, రామసుబ్బాయ్య, బషీర్, హుసేన్ భాష, ఎల్లగౌడ్, హుస్మాన్ భాష, వెంకటేశ్వర్లు, రాజు, సుబ్బారాయుడు, శేఖర్, కాశీం, రామకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలనపై ప్రశ్నిస్తే దాడులా.. అడ్లూరు గ్రామసభలో రక్తపాతం

- సర్పంచ్ భర్త అరాచకం.. ఉపసర్పంచ్, వార్డు సభ్యులపై విచక్షణారహిత దాడి
- గ్రామ నిధుల దుర్వినియోగంపై నిలదీసినందుకు కర్రలు, దిమ్మెలతో విరుచుకుపడ్డ వైనం
- అడ్లూరు కాలనీలో తీవ్ర ఉద్రిక్తత.. పలువురికి గాయాలు, పోలీసుల రంగప్రవేశం
- ఒకే పార్టీకి చెందిన ఇరువర్గాల ఘర్షణతో కోదాడలో ఒక్కసారిగా మారిన రాజకీయ సమీకరణాలు



**నేటి సాక్షి,కోదాడ:** ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన గ్రామసభ కాస్తా రణరంగంగా మారింది. కోదాడ మండలం అడ్లూరు కాలనీలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో నిధుల దుర్వినియోగంపై తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి చివరకు రక్తపాతానికి దారితీసింది. గ్రామ నిధులు ఎక్కడ ఖర్చయ్యాయో లెక్కలు చెప్పాలని పట్టుబట్టిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులపై సర్పంచ్ వర్గం ఒక్కసారిగా దాడికి దిగింది. సర్పంచ్ భర్త, ఆమె మామ తమ అనుచరులతో కలిసి కర్రలు, రాళ్లతో విరుచుకుపడటంతో గ్రామం ఉలిక్కిపడింది. సభ మధ్యలోనే జరిగిన ఈ దాడులతో ప్రాణభయంతో మహిళలు, వృద్ధులు ఇళ్లలోకి పరుగులు తీశారు. ఈ ఘర్షణలో పలువురు ప్రజాప్రతినిధులకు, గ్రామస్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న కోదాడ రూరల్ పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దాడికి పాల్పడిన కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇరువర్గాల మధ్య ఈ ఘర్షణ చోటుచేసుకోవడం ఇప్పుడు నియోజకవర్గవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామ నిధులపై సమగ్ర విచారణ జరిపి, ప్రజాస్వామ్య వేదికపై భౌతిక దాడులకు దిగిన వారిని కఠినంగా శిక్షించాలని అడ్లూరు కాలనీ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి






**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో సోమవారం నిర్వహించిన 'సురక్షిత ప్రయాణం..'అరైవ్-అలైవ్' కార్యక్రమం రోడ్డు భద్రతపై డ్రైవర్లలో చైతన్యం నింపింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో లారీలు, ఐచర్‌లు మరియు ఇతర భారీ వాహనాల డ్రైవర్లు, యజమానుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా చర్యలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన పెంపొందించడం 'అరైవ్-అలైవ్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమని, అందుకే నివారణ చర్యలు అత్యంత కీలకమని ఎస్పీ స్పష్టం చేశారు. డ్రైవర్లు చిన్న చిన్న నిర్లక్ష్యాలకు లోనవుతే అవే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి ఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాత్రి సమయంలో వాహనాలను రోడ్డు పక్కన నిలిపే సందర్భాల్లో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అంటించుకోవాలని సూచించారు. దీని ద్వారా ఇతర వాహనదారులకు వాహనాలు స్పష్టంగా కనిపించి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అలాగే అధిక ప్రకాశం ఉన్న ఎల్ఈడి లైట్లు ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తాయని, వాటి వినియోగంలో నియంత్రణ అవసరమని చెప్పారు. అధిక లోడ్‌తో వాహనాలు నడపడం ప్రమాదకరమని కూడా హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా లారీలు, వ్యాన్ వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికించి డ్రైవర్లకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రైవర్లు కూడా ఈ చర్యను స్వాగతిస్తూ భద్రతా నియమాలను పాటిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తదితరులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, కోరుట్ల సీఐ సురేష్ బాబు, మెట్‌పల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్సైలు చిరంజీవి, రామచంద్రం, కిరణ్, శ్రీధర్ రెడ్డి, రవికిరణ్ తదితరులు, లారీ-వ్యాన్ అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు, యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- సురక్షిత ప్రయాణమే లక్ష్యం
- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్
- 'అరైవ్-అలైవ్' కార్యక్రమంతో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన
- భారీ వాహనాలకు 'రేడియం స్టిక్కర్లు' తప్పనిసరి
- 'డిఫెన్సివ్ డ్రైవింగ్'తో ప్రమాదాల నివారణపై దృష్టి



# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే పోలీసుల లక్ష్యం

- ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా 'ప్రజావాణి'
- ఫిర్యాదుదారుల నుండి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించిన ఎస్పీ నితిక పంత్
- మొత్తం 11 ఫిర్యాదుల స్వీకరణ.. అధికారులకు ఫోన్ ద్వారా ఎస్పీ ఆదేశాలు
- మధ్యవర్తులు, పైరవీలు లేకుండా నేరుగా పోలీసులను ఆశ్రయించాలని సూచన

**నేటి సాక్షి, కుమురం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నితిక పంత్ ఫిర్యాదుదారుల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వాటిని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 11 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఫిర్యాదుల తక్షణ పరిష్కారం కోసం జిల్లాలోని డీఎస్పీలు, ఏఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో ఎస్పీ ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల స్థితిగతులను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ నితిక పంత్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి మధ్యవర్తిత్వం లేదా పైరవీల జోలికి వెళ్లకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించడం, పోలీస్-ప్రజల మధ్య నమ్మకాన్ని పెంపొందించడం మరియు జిల్లాలో శాంతి భద్రతలను



కాపాడటమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరిస్తున్నామని, సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నితిక పంత్ ఈ సందర్భంగా కోరారు.

# మరిపెడలో ఆశా కార్యకర్తల పోరుబాట



- దద్దరిల్లిన నినాదాలు
- వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కిన ఆశా కార్యకర్తలు
- ధర్నాకు సంఘీభావం తెలిపిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్
- కరోనా కష్టకాలంలో ప్రాణాలర్పించి సేవలు చేసినా ప్రభుత్వానికి పట్టదా?
- సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరిక

**నేటి సాక్షి,మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా మరిపెడలో ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ధర్నా సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ హాజరై తన పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ, గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకలాంటి ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన వీరి కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తక్కువ వేతనాలతో నెట్టుకొస్తున్న వీరికి వెంటనే గౌరవప్రదమైన జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆశా కార్యకర్తలు ఈ సందర్భంగా హెచ్చరించారు. నిరసన కారణంగా మరిపెడ కేంద్రంలో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆశా కార్యకర్తల న్యాయపోరాటానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తప్పవని రెడ్యానాయక్ స్పష్టం చేశారు.

# జనకాపూర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి

- జిల్లా కలెక్టర్ కె. హరితకు డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకుల వినతి

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** జిల్లా కేంద్రంలోని జనకాపూర్ వద్ద ఉన్న క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కె. హరితకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్, జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ మాట్లాడుతూ, గతంలో క్రీడా మైదానం అభివృద్ధి కోసం సుమారు రూ.22 లక్షల నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినప్పటికీ, పనులు పూర్తిగా జరగకుండా మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. జిల్లాలో అనేక మంది క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ వంటి క్రీడల్లో నైపుణ్యం కలిగి ఉన్నప్పటికీ, సరైన మైదానం లేకపోవడం వల్ల రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు ఎదగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



క్రీడా మైదానంలో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, విశ్రాంతి గది, రన్నింగ్ ట్రాక్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులు ఏర్పాటు చేయాలని, అలాగే పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. మైదానం మద్యం సేవించే వారికి అడ్డాగా మారుతున్న నేపథ్యంలో నైట్ వాచ్‌మన్ నియామకం, రాత్రి వేళల్లో పోలీసు పర్యవేక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతికి స్పందించిన జిల్లా కలెక్టర్ కె. హరిత, క్రీడా మైదానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# గడి బురుజుల రక్షణకు ఐక్య పోరాటం





**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన కోరుట్ల గడి బురుజుల స్థలాలను కాపాడేందుకు అఖిలపక్ష ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధమయ్యాయి. సోమవారం పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనంలో జరిగిన సమావేశంలో గడి బురుజుల రక్షణపై కీలక తీర్మానాలు చేయగా, అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. సమావేశానికి ముందు గడి బురుజుల కాలం నుండి పూజలు అందుకుంటున్న గడి బురుజుల మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో అఖిలపక్ష నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొని గడి బురుజుల పరిరక్షణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కట్టడాలు చాళుక్యుల కాలానికి చెందిన అపూర్వ వారసత్వమని, వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గడి బురుజులకు సంబంధించిన గ్రామ కంఠ, ఆబాది భూములను కొందరు వ్యక్తులు తమ పేర్లపై పట్టాలు ఉన్నట్లు చెప్పి విక్రయాలు చేయాలని చూస్తున్నారని నాయకులు ఆరోపించారు. ఇలాంటి

- మైసమ్మ సాక్షిగా ఉద్యమానికి శంఖారావం
- చారిత్రాత్మక స్థలాల విక్రయాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన అఖిలపక్ష నేతలు
- విఎల్టీ పర్మిషన్లు వెంటనే రద్దు చేయాలని తీర్మానం

ప్రయత్నాలకు సహకరిస్తున్న రాజకీయ నాయకులను ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటివరకు ఈ స్థలాలపై నిషేధం అమలులో ఉండగా, ఇప్పుడు కొందరు బడా నాయకుల అండతో రియాల్టర్లు వ్యవహారం నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా గడి స్థలాలలో నిర్వహించే మహిషాసుర వధ కార్యక్రమం కోరుట్ల ప్రజలకు ఎంతో పవిత్రమైనదని తెలిపారు. ఈ స్థలాలు కోల్పోతే ఆ సంప్రదాయాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గడి స్థలాలను పరిరక్షించి, అక్కడ కూరగాయల మార్కెట్, పార్క్ వంటి ప్రజా ఉపయోగాల సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గడి బురుజుల స్థలాల్లో ఇచ్చిన విఎల్టీ పర్మిషన్లను వెంటనే రద్దు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. లక్షల రూపాయల లంచాలతో అనుమతులు మంజూరు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తమ డిమాండ్లను బలంగా వినిపించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు చెన్న విశ్వనాథం, డా. పేట భాస్కర్, ఎం.డి. ముజాహిద్, తుమ్మలపల్లి శ్రీనివాస్, చింత భూమేశ్వర్, న్యాయవాది బోయిని సత్యం, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర శేఖర్, కస్తూరి లక్ష్మీనారాయణ, సుతారి రాములు, కుంచెం శంకర్, భూపేల్లి నాగేశ్వరరావు, కృష్ణంరాజు, షాహేద్ మహ్మద్ షేక్, పోతని సత్యం తదితరులు పాల్గొని గడి బురుజుల రక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# రైతుల కష్టాన్ని దోపిడీ చేయడం అన్యాయం

## మార్కెట్ యార్డ్‌లో అక్రమాలపై వికారాబాద్‌లో రైతుల భారీ గళం



**నేటి సాక్షి,వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా రైతులు భారీగా సమావేశమై తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మార్కెట్ యార్డ్‌లో జరుగుతున్న దోపిడీ, అధికారుల నిర్లక్ష్యంపై రైతు సంఘం నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షుడు కోదండ రెడ్డి మాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తెస్తే అక్రమ మార్గాల్లో వారిని దోచుకోవడం అన్యాయమన్నారు. రైతు లేనిదే రాజ్యం సుభిక్షంగా ఉండదని, అధికారుల తీరు మారకపోతే సహించబోమని హెచ్చరించారు. ప్రధానంగా మార్కెట్‌లో తూకంలో కేవలం ఒక కిలో మాత్రమే తరుగు తీయాలని, 'మొట్టి' విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కమిషన్‌ను నాలుగు శాతం నుండి రెండు శాతానికి తగ్గించాలని, రైతులకు తప్పనిసరిగా తక్ పట్టి (తూకం రసీదు) ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, నిలువ నీడ, భోజనశాల, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘ నాయకులు రంగారావు, రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బోరెడ్డి నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శీను ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం మరియు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో మురుగు రొంపి



**నేటి సాక్షి,శంకర్పల్లి:** శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్య లోపం పతాక స్థాయికి చేరింది. మార్కెట్ ప్రాంగణంలో ఉన్న సులబ్ కాంప్లెక్స్ నుండి మురుగు నీరు నిరంతరం పొంగిపొర్లుతుండడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఈ సమస్య వేధిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. మార్కెట్‌లో ఉన్న రెండు సులబ్ కాంప్లెక్స్‌లలో ఒకటి పూర్తిగా నిరుపయోగంగా మారగా, మరొకటి నుండి వెలువడే మురుగు నీరు డ్రైనేజీ ద్వారా బయటకు రాకుండా మార్కెట్ ప్రాంగణంలోకి చేరుతోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన వ్యాపిస్తోంది. వ్యాపారులు ముక్కు మూసుకుని వ్యాపారం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా గత ఆదివారం మురుగు నీరు మార్కెట్‌లోకి భారీగా చేరడంతో, రైతులు తమ కూరగాయలను అదే అపరిశుభ్ర నీటిలో ఉంచి విక్రయించాల్సి వచ్చింది. ఈ మురుగు నీటి వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సులబ్ కాంప్లెక్స్ సమస్యను పరిష్కరించి మార్కెట్‌లో పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామ శాఖ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

## అధ్యక్షులుగా పంగ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా గాదె బాబు



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మండల పరిధిలోని తడకమళ్ళ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు, మరియు కమిటీ సభ్యులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ యువజన సంఘం తడకమళ్ళ గ్రామశాఖ అధ్యక్షులుగా పంగ యాదగిరి, ఉపాధ్యక్షులు బొజ్జ వెంకటేష్, ఉపాధ్యక్షులు, గాదె శంకర్, ప్రధాన కార్యదర్శి గాదె బాబు, కోశాధికారి జిల్లా సైదులు, ప్రధాన సలహాదారులుగా గాదె సాయి, జిల్లా శ్రీను, కుల పెద్దలను, అంబేద్కర్ యూత్ సభ్యులు తదితరులను ఎన్నుకున్నారు.

# పత్తి సాగుతో రైతులకు లాభాలు

## ఎరువుల యాజమాన్యంపై రైతులకు శాస్త్రవేత్తల సూచనలు




**నేటి సాక్షి,జగదేవపూర్:** పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతిని పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. సోమవారం ఇటిక్యాల గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. రవి, డా. దత్తాత్రేయ, డా. ప్రతాప్ రెడ్డి మరియు డా. పల్లవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక సాంద్రత సాగులో చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం మరియు మొక్కల ఎదుగుదల నియంత్రకాల వినియోగంపై రైతులకు వివరించారు. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజా లింగం, ఉప సర్పంచ్ నరేశ్, ఏఈఓ సమత మరియు రాశి విత్తన బృందం, రైతులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో నేరాలకు చెక్ ప్రజా భద్రతకు కొత్త బలం



- మెట్‌పల్లి డీఎస్పీ రాములు
- నేరాల నియంత్రణ, ఛేదనలో సాంకేతికత కీలకమని సూచన
- ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపు

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి పట్టణంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రజల భద్రతకు కొత్త దిశను చూపిస్తున్నాయి. మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 26వ వార్డులో కౌన్సిలర్ బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాలను సోమవారం డీఎస్పీ రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నేరాలను నియంత్రించడంలోనే కాకుండా, నేరస్థులను వేగంగా గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల ఫుటేజ్ అత్యంత ఉపయోగకరమని వివరించారు.

గ్రామాల్లో జరిగే చిన్న చిన్న సంఘటనల నుండి పెద్ద ఘటనల వరకు ప్రతి అంశాన్ని సీసీ కెమెరాల ద్వారా తక్షణమే గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం 24 గంటలు పనిచేస్తూ ప్రజలకు భద్రత కల్పిస్తాయని, అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించడంలో ఇవి కీలకమని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఎస్పీ కొనియాడారు. పోలీసులకు ప్రజల సహకారం ఉంటేనే శాంతి భద్రతలు మరింత బలోపేతం అవుతాయని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్సై కిరణ్ కుమార్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

- ఏప్రిల్ 1 నుంచి 3 వరకు ఘనంగా ఉత్సవాలు
- భక్తుల రద్దీ దృష్ట్యా విస్తృత ఏర్పాట్లు
- భద్రత, సౌకర్యాలపై అధికారుల కఠిన చర్యలు



**నేటి సాక్షి, జగిత్యాల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట లోని కొండగట్టు పుణ్యక్షేత్రంలో 'చిన్న హనుమాన్ జయంతి' ఉత్సవాలు ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలను యంత్రాంగం వేగవంతం చేసింది. సోమవారం కొండగట్టు ఆలయ పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ కలిసి పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న చర్యలను సమగ్రంగా సమీక్షించి, ప్రతి అంశంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేవాలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలని, 64 సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పోలీస్ శాఖకు ఆదేశించారు. హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసాద కౌంటర్లు, దీక్ష విరమణ ప్రాంతాల్లో క్యూ లైన్ల వద్ద ప్రత్యేక బందోబస్త్ కల్పిస్తున్నట్లు తెలిపారు. భక్తుల కోసం ఆరు ప్రదేశాల్లో ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలిక టెంట్లు, మెట్ల దారిలో లైటింగ్ సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. తాగునీటి సదుపాయం (చలివేంద్రాలు), మరుగుదొడ్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని పేర్కొన్నారు. కొండపై వైద్య సిబ్బందిని నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వడదెబ్బ నివారణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి, 108 అంబులెన్స్ సేవలను సిద్ధంగా ఉంచనున్నట్లు తెలిపారు. ఉత్సవాల రోజుల్లో 24 గంటల విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. భక్తుల రాకపోకలకు సౌకర్యంగా వేములవాడ, జగిత్యాల, కరీంనగర్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. దేవస్థానం పరిధిలో మరియు గుట్ట కింద వీధుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతర శుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. కోనేరు వద్ద ఎప్పటికప్పుడు నీరు నింపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన విధులు నిర్వర్తించే అధికారులు సంబంధిత ప్రదేశాల్లోనే బస చేసి బాధ్యతాయుతంగా తమ కర్తవ్యాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, ఆలయ ఈఓ అంజనా రెడ్డి, ఎమ్మార్వోలు, ఎంపిడివోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భానుముక్కలలో అట్టహాసంగా బండలాగుడు పోటీలు



- విజేతగా నిలిచిన తెలంగాణ అక్షర రెడ్డి (రాయవరం) వృషభ రాజాలు
- శ్రీరామనవమి పురస్కరించుకుని సీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ
- వృషభ పోటీల్లో భానుముక్కల గ్రామం రాష్ట్రస్థాయిలో నిలవడం అభినందనీయం: వైస్ ఎంపీపీ బండ్లమూరి

**నేటి సాక్షి, పాములపాడు:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా పాములపాడు మండలం భానుముక్కల గ్రామంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు అత్యంత ఉత్సాహంగా ముగిశాయి. టీడీపి మండల నాయకులు, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, సీఆర్ఎస్ యూత్ అసోసియేషన్ నాయకులు రంగస్వామి సహకారంతో ఈ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, భానుముక్కల గ్రామం వృషభ రాజాల పోటీల్లో రాష్ట్రస్థాయి గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పోటీలు ఇతర గ్రామాల రైతులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ హోరాహోరీ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన అక్షర రెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 80,000 నగదు బహుమతిని గెలుచుకున్నాయి. అదే గ్రామానికి చెందిన అక్షర రెడ్డికి చెందిన మరో జత వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 60,000 కైవసం చేసుకున్నాయి. ఇక ఆతిథ్య గ్రామం భానుముక్కలకు చెందిన బోయినేని ఉరక్ వృషభాలు మూడవ స్థానంలో నిలిచి రూ. 40,000 బహుమతిని సొంతం చేసుకున్నాయి. నాలుగో బహుమతి రూ. 20,000లను రాయవరం గ్రామానికి చెందిన ధనుష్ రెడ్డి మరియు సోమయాజుల పల్లెకు చెందిన నరసయ్య యాదవ్ వృషభాలు సంయుక్తంగా గెలుచుకున్నాయి. ఐదో బహుమతి రూ. 10,000 నాగేంద్ర గౌడ్ (కుడిచెర్ల), ఆరో బహుమతి రూ. 8,000 బియ్యాల వెంకట నరసయ్య (ఎర్రగుడూరు) వృషభాలు సాధించాయి. ఈ సందర్భంగా శివాలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్న రైతులకు భోజన వసతి కల్పించి పోటీలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నాం హనుమంత రాయుడు, రాము చౌదరి, మాజీ సర్పంచ్ బాల్నాయక్, బండ్లమూరి రవి, కొత్త వెంకటేశం, రామకృష్ణ ప్రసాద్, రాజమోహన్ రెడ్డి, కొండారెడ్డి, లక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతిరోజు సూర్య నమస్కారాలతో ఆరోగ్యం పుష్కలం

- గజ్వేల్ సూర్య నమస్కారాల బృందం 9వ వార్షికోత్సవం ఘనం
- నడక, యోగాతో ఒత్తిడిని జయించాలని గజ్వేల్ రూరల్ సీఐ ముత్యం రాజు సూచన



**నేటి సాక్షి, గజ్వేల్:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, నిత్యం సూర్య నమస్కారాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సూర్య నమస్కారాల బృందం అధ్యక్షులు సుభాష్ రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఈ బృందం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం ముట్రాజ్ పల్లి మహిళా భవనం జిమ్ వద్ద వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం నడకతో పాటు సూర్య నమస్కారాలు చేయడం వల్ల శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని వైద్యశాస్త్రం కూడా చెబుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం గజ్వేల్ పట్టణంలో 50 మందికి పైగా సభ్యులు నిత్యం ఉదయం వాకింగ్ చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఒత్తిడితో కూడిన నేటి జీవనశైలిలో ఇలాంటి కలయికలు ఎంతో అవసరమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు సమాజంలోని సమస్యలపై చర్చిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన గజ్వేల్ రూరల్ సీఐ ముత్యం రాజు మాట్లాడుతూ.. మంచి అలవాట్లు అలవర్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబాన్ని కూడా చక్కగా నడిపించాలని సూచించారు. సూర్య నమస్కారాల బృందం చేస్తున్న కృషిని అభినందిస్తూ మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు నర్సింలు మరియు బృందం సభ్యులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్ట్

## వాహనాల తనిఖీలో పట్టుబడ్డ ముగ్గురు నిందితులు



**నేటి సాక్షి,తిరుమలాయపాలెం(రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టగా, ఖమ్మం నుండి మరిపెడ వైపు వెళ్తున్న ఓ ఆటోలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి స్మగ్లింగ్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిందితులను ఖమ్మం టౌన్‌కు చెందిన షేక్ సోహైల్, కట్ట వినయ్, మహమ్మద్ కాజా మొహినుద్దీన్‌గా పోలీసులు గుర్తించారు. వీరు ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయిని సేకరించి, ఎక్కువ ధరకు విక్రయించేందుకు తిరుమలాయపాలెం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి కిలో 25 గ్రాముల ఎండు గంజాయి, ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్ మరియు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణాపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# గంజాయి విక్రేతలకు జైలు శిక్ష

## జగిత్యాల కోర్టు తీర్పు

**నేటి సాక్షి, జగిత్యాల :** జగిత్యాల జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలకు పాల్పడిన ఐదుగురు నిందితులకు న్యాయస్థానం ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. సోమవారం తీర్పు వెలువరించిన 1వ అదనపు జిల్లా జడ్జి ఎస్. నారాయణ, నిందితులు సోయాం రాజు, రాజ్ కుమార్, సాయి చంద్, బాల నరేష్, సాయి సృజన్‌లను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధించారు. 2022లో పత్తి చేనులో గంజాయి సాగు చేస్తూ, సరఫరా చేస్తున్న క్రమంలో 1.25 కిలోల గంజాయితో వీరు పోలీసులకు చిక్కారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కేసులో ప్రతిభ కనబరిచిన పోలీస్, లీగల్ బృందాన్ని ఆయన అభినందించారు.

# ఆశా వర్కర్స్ నిరసన

## సమస్య పరిష్కరించమంటే...నిర్బంధం చేస్తారా...



**నేటిసాక్షి మిర్యాలగూడ:** ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై అక్రమ అరెస్టులకు పాల్పడుతున్న ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ, సిఐటియూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మిర్యాలగూడ పట్టణంలో భారీ ర్యాలీ మరియు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుల మల్లు గౌతంరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి రవినాయక్ మాట్లాడుతూ, సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లను, ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం చెల్లించి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆశా వర్కర్లపై, మిగతా కార్మిక రంగాలపై జరుగుతున్న అక్రమ అరెస్టులను తక్షణమే నిలిపివేయాలని, ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు మరియు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి, ఆశా వర్కర్లకు న్యాయం చేయాలని సిఐటియూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భైరం దయానంద్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు మహేశ్వరీ, సరిత, విద్యా, శాంతి, హుసేనమ్మ, గౌస్య, పద్మ, కుమారి, ఇందిరా, ఆచాలి, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం

## రాంనూర్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా అయిత సుమన్ ఏకగ్రీవ ఎన్నిక



**నేటి సాక్షి,ఎండపల్లి:** రాష్ట్రంలో పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడంపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రత్యేక దృష్టి సారించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామంలో సోమవారం నూతన గ్రామ శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడు చల్లూరి రాంచంద్రం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడిగా అయిత సుమన్, ప్రధాన కార్యదర్శిగా బిడారి సత్తయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని, ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని విమర్శించారు. 2029లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, జూపాక కుమార్, పెద్దూరి భరత్, బాలసాని సత్యం, కొప్పుల సురేష్, రంగు తిరుపతి గౌడ్, సంకోజు తిరుమలాచారి మరియు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుబ్లేడ్‌లో మెగా హెల్త్ క్యాంప్





**నేటిసాక్షి, తిరుమలాయపాలెం(రుద్రరాజు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య వైద్యశాఖ ఆమోదించిన మెగా హెల్త్ క్యాంపును ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ పీహెచ్సీ పరిధిలో హెల్త్ క్యాంప్ ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామపంచాయతీ సర్పంచ్ సంగబతుల స్వాతి సుమన్ రెడ్డి హాజరై రిబ్బన్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వాతి మాట్లాడుతూ మెగా హెల్త్ క్యాంపు నిర్వహించినందుకు చాలా ఆనందంగా ఉందని అలాగే గ్రామ ప్రజలు చుట్టుపక్కల ఉన్న తండావాసులు ఈవైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. సుబ్లేడ్ పిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధర మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ హెల్త్ క్యాంప్ ను నిర్వహించడం జరిగిందని, ఈరోజు జరిగిన మెగా వైద్య శిబిరంలో సుమారుగా 320 మందికి వైద్య సేవలు అందించడం జరిగింది .ఈ మెడికల్ క్యాంపును గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని ఈ హెల్త్ క్యాంపు లో భాగంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రశాంతి జనరల్ వైద్యులు, డాక్టర్ శ్రీవిద్య గైనకాలజిస్ట్, డాక్టర్ మాలిక్ ఆర్థోపెడిషన్, డాక్టర్ రాంబాబు పీడియాట్రిషన్, డాక్టర్ అశ్విని ఆప్తమాలజిస్ట్, డాక్టర్ నరేష్ దంత వైద్యులు, హాజరయ్యారు వీళ్ళ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అలాగే సుబ్లేడ్ పరిధిలో ఉన్న పీహెచ్సీ చాలా పురాతన కాలంలో నుండి ఉన్నదని నేటికీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెగా హెల్త్ క్యాంపును నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి ముఖ్యమంత్రిగా చేసిన మర్రి చెన్నారెడ్డి సుబ్లేడ్ పిహెచ్ సి కి మొదటి వైద్యుడిగా చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఆనాటి నుండి ఈనాటి వరకు వైద్య సేవలు అలాగే కొనసాగుతున్నాయని భవిష్యత్తులో కూడా ఇలాగే వైద్య సేవలు కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుమన్ రెడ్డి, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ ,నరసింహారెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2న జిల్లావ్యాప్తంగా 'ప్రజాపాలన

- ప్రగతి ప్రణాళిక' సభలు
- గ్రామ, వార్డు సభల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రాల పంపిణీకి అధికారులకు ఆదేశం



**నేటి సాక్షి,రాజన్న సిరిసిల్ల (శివకుమార్):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా వచ్చే నెల ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (×ణూజ) నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు మరియు పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామ సభ మరియు వార్డు సభలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేయాలని, వేదికల వద్ద పథకాల విజయాలను వివరించే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలకు వివరించాలని ఆదేశించారు. సభల్లో లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించడంతో పాటు, వారి అభిప్రాయాలను సేకరించాలని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ ఉదయం 10:00 గంటలకు పాఠశాలలు లేదా పంచాయతీ భవనాల్లో ఈ సభలు ప్రారంభం కావాలని, మైక్ సెట్లు మరియు ప్రొజెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు మరియు యువతను ఈ సభలకు ఆహ్వానించాలని కోరారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తున్న అధికారులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ సమీక్షలో డీఆర్డీఓ గీత, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్ మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా రాజారాంపల్లి వారసంతా వేలం

- రికార్డు స్థాయిలో పాట..గ్రామానికి భారీ ఆదాయం
- రూ.60.75 లక్షలతో సంగ రాములు కైవసం




**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధి రాజారాంపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన పశువుల, కూరగాయల వారసంతా వేలం ఉత్కంఠ భరితంగా సాగింది. మార్చి 26న విడుదలైన ప్రకటన మేరకు జరిగిన ఈ వేలంలో మొత్తం 37 మంది పాల్గొని పోటీ కనబర్చారు. డీఎల్పీవో వి.విజయ, ఎంపీడీవో కృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం ప్రారంభం నుంచే వేడెక్కింది. ఒక్కో దశలో ధరలు పెరుగుతూ పోటీదారులు తీవ్రంగా పోటీపడ్డారు. చివరి నిమిషాల్లో ఉత్కంఠ తారాస్థాయికి చేరుకోగా, సంగ రాములు రూ.60.75 లక్షల అత్యధిక ధరకు వారసంతాను కైవసం చేసుకున్నారు. ఈ వారసంతా హక్కులు ఒక సంవత్సరం గడువు కాలానికి వర్తిస్తాయి. గతంలో కూడా ఇదే వారసంతాను ఆయన దక్కించుకోవడం గమనార్హం. ఈసారి వేలం ద్వారా గ్రామ పంచాయతీకి గణనీయమైన ఆదాయం లభించి, గత ఏడాదితో పోలిస్తే రూ.25,64,000 అధికంగా రావడం పంచాయతీకి ఆర్థికంగా బలాన్నిచ్చింది. గ్రామాభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు సర్పంచ్ సంగ రమేష్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వారసంత వేలాల్లో ఇదే అత్యధిక ధరగా నమోదవడంతో రాజారాంపల్లి గ్రామం ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. వేలం సందర్భంగా కొంతసేపు వాదనలు, ఆరోపణలు చోటుచేసుకున్నప్పటికీ, అధికారులు వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కూడా అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేలం ప్రశాంతంగా ముగిసింది. పంచాయతీ కార్యదర్శి డి.మల్లేష్ వేలం వివరాలను అధికారికంగా ప్రకటించగా, కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెరుగు జానీ, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని ఆసక్తిగా వీక్షించారు. అనంతరం పంచాయతీ అవరణలో సర్పంచ్ సంగ రమేష్ పాలకవర్గంతో కలిసి రాములును శాలువాతో సన్మానించారు.

# అధ్యాపకులు పరిశోధనా రంగంపై దృష్టి సారించాలి



- ఎన్‌జీ కళాశాల అకాడమిక్ కౌన్సిల్ సమావేశంలో డా. నరేందర్ రెడ్డి సూచన
- న్యాక్ గుర్తింపులో పరిశోధనలదే కీలక పాత్ర.. ప్రతి ఏటా రెండు ఆర్టికల్స్ ప్రచురించాలి

**నేటి సాక్షి, నల్లగొండ:** ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధిలో పరిశోధనలు కీలకమని, అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధనా రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డా. నరేందర్ రెడ్డి సూచించారు. సోమవారం నాగార్జున ప్రభుత్వ కళాశాల (బీ+ జశీశ్రీశ్రీవస్త్రవ) అకాడమిక్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాక్ (చీూూజ) గుర్తింపు సాధించడంలో పరిశోధనలు ప్రధాన భూమిక పోషిస్తాయని, ప్రతి అధ్యాపకుడు కనీసం ఏడాదికి రెండు పరిశోధనా వ్యాసాలను ప్రముఖ పత్రికల్లో ప్రచురించాలని కోరారు. కళాశాల స్థాయిలో రీసెర్చ్ కమిటీని ఏర్పాటు చేసి, పరిశోధనలు చేసే వారికి ప్రత్యేక గ్రాంట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జాతీయ సదస్సుల నిర్వహణతో పాటు విద్యార్థులలో కూడా పరిశోధనా కాంక్షను రగిలించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ.. కళాశాలలో తీసుకునే ప్రతి నిర్ణయం ప్రభుత్వ మార్గదర్శకాలు, వర్సిటీ ఉత్తర్వుల మేరకే ఉంటుందని, కౌన్సిల్ సూచించిన అంశాలను కమిటీల ద్వారా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సర్జన్ డా. ఎ. పుల్లారావు, కార్పొరేటర్ శ్రీధర్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ బత్తిని నాగరాజు, డా. పరంగి రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అంతటి శ్రీనివాసులు మరియు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనే లక్ష్యంగా ఉద్యమం

### సీఐటీయూ నాయకుడు పుట్ట కృష్ణమాచారి



**నేటి సాక్షి మంచిర్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ సోమవారం రోజున స్థానిక తెలంగాణా తల్లి విగ్రహం ఎదుట సీఐటీయూ నాయకుడు పుట్ట కృష్ణమా చారి ఆశా వర్కర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆశాలకు ఉద్యగ భద్రతా, ఆశా వర్కర్లకు 18వేల జీతం పెంచి ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస జీతాలు ఇవ్వకుండా ఆశాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటే ఊరుకోబోమని, ఆశాల హక్కుల సాధనకై నిరంతర పోరాటం చేస్తామని కృష్ణమా చారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సరోజా, సభ్యులు విజయ, లక్ష్మి, శారద, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్ చేస్తే చర్యలుతప్పవు

### ఎస్సై హనుమాన్ నాయక్



**నేటి సాక్షి, చిలుకూరు:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిలుకూరులో సోమవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు ఎస్సై హనుమాన్ నాయక్ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేని మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు వారిని ప్రమాదంలోకి నెట్టవద్దని హెచ్చరించారు. తెలిసి తెలియని డ్రైవింగ్‌తో మైనర్లు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు తెస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ఎదుటి వారి మరణానికి కారణమైన వారికి కొత్త చట్టాల ప్రకారం 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని ఎస్సై స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కారణం లేని మరణం ఒక్క రోడ్డు ప్రమాదం మాత్రమేనని, దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## జీవితాన్ని కాపాడుకుందాం

### కావేరి విశ్వవిద్యాలయంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమ




**నేటి సాక్షి, గజ్వేల్:** రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ మురళి పిలుపునిచ్చారు. సోమవారం గౌరారం శివారులోని కావేరి విశ్వవిద్యాలయంలో ఎస్ఐ కరుణాకర్ రెడ్డితో కలిసి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం మరియు డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండటం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ హర్ష పోల్సాని, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు..

## సీఎం సహాయనిధి పేదలకు వరం

### అనారోగ్యంతో ఇబ్బంది పడే పేద కుటుంబాలకు ప్రభుత్వం అండ



**నేటి సాక్షి,జగదేవపూర్:** జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు సోమవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మెండే కనకయ్య మరియు నిరగంటి నర్సింలు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందగా, ప్రభుత్వం వారికి చెరో రూ. 76,500 చొప్పున ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆపద కాలంలో పేదలకు సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని, అర్హులైన వారందరూ ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు భార్గవి, ప్రశాంత్, కిష్టయ్య మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

## మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు

### ఘనంగా 'మెక్ గఫి' హైస్కూల్ 14వ వార్షికోత్సవ వేడుకలు

- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు..
- అలరించిన మిక్కీమౌస్ బొమ్మలు

**నేటి సాక్షి, కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి):** విద్యార్థులు తమ భవిష్యత్తును కేవలం విద్యతోనే సుస్థిరం చేసుకోగలరని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని 'మెక్ గఫి' హైస్కూల్ 14వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం (మార్చి 29) రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడంలో మేగ్ గోపి పాఠశాల యాజమాన్యం చక్కగా కృషి చేస్తోందని అభినందించారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై పూర్తి శ్రద్ధ చూపాలని, వారికి ఏ రంగంలో ఆసక్తి ఉన్నా తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించాలని సూచించారు. 16వ వార్డు కౌన్సిలర్ కచ్చకాయల జ్యోతి మాట్లాడుతూ.. విద్యతో పాటు వ్యక్తిత్వ నిర్మాణం జరిగి విద్యార్థులు సంపూర్ణ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ తాజుద్దీన్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు పూర్తి బాధ్యత తమదేనని స్పష్టం చేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాడిన పాటలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా వేదికపై ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన మిక్కీమౌస్ బొమ్మలు పిల్లలను ఎంతగానో ఉత్సాహపరిచాయి. ఈ వేడుకల్లో వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయ బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.









